
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 26 మార్చి 2025

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (హరనాథపురం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో 2025- 26 విద్యా సంవత్సరానికి 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశం పొందేందుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 31 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు ఉందని తెలిపారు. నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువు పాడులో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాల (బాలురు)లో 6, 7, 8 తరగతుల్లో ప్రవేశం కోసం పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

8వ పేజీలో..

ఆదాయపు పన్ను సకాలంలో చెల్లించాలి • ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా శ్రీనివాసులు • కుష్ఠును ముందే గుర్తిస్తే నివారణ • సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.26 (బుధవారం సాయంత్రం)
సహరి : 4.53 (గురువారం ఉదయం)

కార్పొరేషన్ పద్దు.. ప్రగతి పొద్దు

నెల్లూరు నగర పాలక సంస్థ భారీ బడ్జెట్‌తో సిద్ధమైంది. రూ.695.95 కోట్లతో పద్దును సిద్ధం చేసిన ఎన్ఎంసీ యంత్రాం గం బుధవారం మేయర్ స్రవంతి అధ్యక్షతన కౌన్సిల్లో ప్రవేశ పెట్టనున్నది. ప్రణా ళిక వ్యయం 448.52 కోట్లుగా లెక్కగట్టిన యంత్రాంగం ప్రణాళికేత ర వ్యయం రూ.247.43 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఈసారి ఆర్థిక సంవత్సరంలో పన్నుల ద్వారా 44.73 శాతం ఆదాయం ఖజానాకు వస్తుం దని భావిస్తున్న కార్పొరేషన్ అధికారులు ఫీజులు, యూజర్ చార్జీల ద్వారా మరో 29.64 శాతం రాబట్టగల మని లెక్కగడు తున్నారు. మొత్తం మీద భారీ వ్యయాల తో పద్దును సిద్ధం చేసి కౌన్సిల్ ముందుకు తీసుకురానున్నారు.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)



నేడు కౌన్సిల్లో ప్రవేశపెట్టనున్న మేయర్ స్రవంతి

• కార్పొరేషన్ బడ్జెట్ రూ.695.95 కోట్లు • ప్రణాళికా వ్యయం రూ.448.52 కోట్లు • ప్రణాళికేతర వ్యయం రూ.247.43 కోట్లు

నూతన పద్దు రూ.695.95 కోట్లతో బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగే కౌన్సిల్ సమావేశంలో మేయర్ స్రవంతి అధ్యక్షతన బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. రానున్న ఆర్థిక ఏడాదిలో రూ.122.52 కోట్లు (44.73 శాతం) పన్నుల ద్వారా, వివిధ రకాల ఫీజులు, యూజర్ చార్జీల ద్వారా రూ.81.19 కోట్ల ఆదాయం సమకూరుతుందని భావిస్తు న్నారు. హెడ్ ఆఫ్ ది అకౌంట్ కింద రూ.273.92 కోట్లు వివిధ మార్గాల ఆదాయం ఖజానాకు చేరుతుండగా అందులో ప్రణాళిక వ్యయం ద్వారా ఖర్చులను చూపారు. మున్సిపల్ కాంప్లెక్స్‌ల ద్వారా రానున్న ఏడాదిలో రూ.3.44 కోట్ల ఆదాయం వస్తుందని లెక్కకట్టారు. గతేడాది రూ.3.39 కోట్లు ఆదాయంగా పెట్టుకుని అందులో రూ.2.52 కోట్లే వసూళ్లు చేయగలిగారు. కాగ ప్రస్తుతం అమలులో లేని, ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న బీఆర్ఎస్, ఎల్ఆర్ఎస్‌ల ద్వారా ఏకంగా రూ.15 కోట్లు కార్పొరేషన్‌కు ఆదాయం వస్తుందని లెక్కకడు తున్నారు. గతేడాది ఇదే తరహా లెక్కలేసిన అధికారులు రూపాయి కూడా రాబట్టలేకపోయారు. ఇక నగరంలో గుర్తించిన ఖాళీ స్థలాలపై పన్ను ద్వారా ఈసారి రూ. 19 కోట్ల వరకు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ట్రేడ్ లైసెన్సుల ద్వారా రూ.3.50 కోట్లు, రోడ్ల ఆక్రమణల రుసుముల పేరిట మరో రూ.11.50 లక్షలు వసూళ్లు చేయాలని యంత్రాంగం నిర్ణయించింది.

• లేఅవుట్ల క్రమబద్ధీకరణ ద్వారా..

ఇప్పటివరకు నగర పరిధిలోని లేఅవుట్ల క్రమబద్ధీకరణ అనుమతులు నుడా పరిధిలో ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కార్పొరేషన్‌కు అనుమతులు అప్పగిస్తూ పురపాలక శాఖ ఆదేశాలిచ్చింది. ఈ లెక్కన రానున్న ఆర్థిక ఏడాదిలో రూ.15 కోట్లు వరకు క్రమబద్ధీక రణ ఫీజుల ద్వారా ఆదాయం సమకూరు తుందని అధికారులు భావిస్తున్నారు. భూ గర్భ డ్రైనేజీ కనెక్షన్ల ద్వారా రూ.5 కోట్లు రాబట్టాలని ఎన్ఎంసీ అధికారులు లెక్కకట్టారు. కానీ తాజాగా పురపాలక మంత్రి నారాయణ యూజీడీ కనెక్షన్ రూపాయికే ఇస్తామని ప్రకటించ డంతో బడ్జెట్‌లో ఈ ఆదాయం ప్రశ్నార్థకంగా మారింది.

• ఆప్కాస్‌కు పెరిగిన వ్యయం

కార్పొరేషన్‌లో విచ్చలవిడిగా ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆప్కాస్ ద్వారా జీతాలుచెల్లిస్తున్నారు. గతేడాది రూ.55 కోట్లు చెల్లించగా, ఈసారి రూ.63 కోట్లు చెల్లించేందుకు పద్దు సిద్ధం చేయడం గమనార్హం. కార్పొరేటర్లగా గెలిచి మూడున్నరేళ్ల కాలం పూర్తయిన ఈ సమయంలో శిక్షణకు రూ.25 లక్షలు బడ్జెట్ కేటాయింపులు జరపడం విశేషంగా మారింది. మేయర్ పేషీలో గడుస్తున్న ఆర్థిక సంవత్సరంలో రూ. 8 లక్షలు ఖర్చు చేసినట్లు బడ్జెట్‌లో చూపిన అధికారులు రానున్న సంవత్సరానికి రూ. 10 లక్షలు కేటాయించారు. పారిశుధ్య కార్మికులకు రూ. 25లక్షలు పెట్టి చెప్పులు కొన్నామని, రూ. 40 లక్షలు టెలిఫోన్‌కు, ఇంకో రూ. 12 లక్షలు మొబైల్స్‌కు ఖర్చయినట్లు అధికారులు బడ్జెట్‌పద్దులో చెప్పుకొచ్చారు. రోడ్లపైనున్న జంతువుల నియంత్రణకు రూ.15 లక్షలు, కుక్కలకు ఏబీసీ చికిత్సలకు రూ.80 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు లెక్కకట్టారు. వీటన్నీటిపై సభ్యులు ఏమాత్రం ప్రశ్నిస్తారో నేడు జరిగే కౌన్సిల్ వైపు అందరి చూపుమళ్లింది.

ఆస్తి పన్ను వడ్డీపై 50 శాతం రాయితీ

నెల్లూరు(సిటీ), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి పన్ను చెల్లింపుదారు లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త వినిపించిందని నెల్లూరు నగర కమిషనర్ సూర్యతేజ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆస్తి పన్ను వడ్డీలో 50 శాతం వరకు రాయితీ ఇస్తూ రాష్ట్ర పురపాలక శాఖ ఉత్తర్వులిచ్చినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులందరు సద్వినియోగం చేసుకుని ఈ నెలాఖరులోపు పన్నులు చెల్లించాలని కోరారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ చేయాలి

• ఎన్ఎంసీ ఎదుట సీపీఎం ఆందోళన



ఏడీసీ కారును అడ్డుకుంటున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

నగరంలోని ఆస్తి పన్నులపై వేస్తున్న వడ్డీని మాఫీ చేయాలని డిమాండ్ చేస్తు సీపీఎం నాయకులు, కార్యకర్తలు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా, నగర కార్యదర్శులు మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటి పన్నుకు వడ్డీలు, కొళాయిలకు పన్నులు, జరిమానా విధించడం వల్ల నగర వాసులు భయభ్రాంతులకు గురవుతున్నట్లు వాపోయారు. దోమల బెడద నుంచి ప్రజలను కాపాడాలని, డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలతో పౌరులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. అనంతరం ఏడీసీ నందన్ కారును అడ్డుకుని నిరసన తెలిపారు. ఆపై మేయర్ స్రవంతికి వినతిపత్రం అందచేశారు. ముందుగా ఆందోళనకారులను పోలీసులు ప్రధాన గేట్ల వద్ద అడ్డుకున్నారు. ఈ నిరసనలో నాయకులు నాగేశ్వరరావు, పెంచలనరసింహంలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఎల్-1 స్కానర్లు

• ఎల్-0 స్థానంలో కొత్తవి • అక్రమాలకు చెక్ పెట్టేందుకే..
• సచివాలయాలకు పంపిణీ • వచ్చే నెల నుంచి వినియోగం

నెల్లూరు (హరనాథపురం) మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అక్రమాలను నియంత్రించేందుకు ఆధునిక సాంకేతికత కలిగిన ఎల్-1 స్కానర్లను జిల్లాకు పంపింది. ఇప్పటికే ఈ స్కానర్లను స్థానిక సచివాలయాల సిబ్బందికి పంపిణీ చేశారు. ఏప్రిల్ నుంచి వీటి సహాయంతో పింఛన్లు అందించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పంపిణీకి సంబంధించి ఇప్పటివరకు ఎల్-0 స్కానర్లను వినియోగిస్తున్నారు. అయితే ఆ స్కానర్లలో లబ్ధిదారుల వేలిముద్రలు వేస్తుంటే ఇబ్బందులు తలెత్తేవి. దీనికితోడు కొన్ని రాష్ట్రాల్లో నకిలీ వేలి ముద్రలు రూపొందించి పింఛన్లు పక్కదోవ పట్టిస్తున్నారన్న ఫిర్యాదులు యూఐటీఏఐ (యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) కి వెళ్లాయి. దీంతో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఆధునిక సాంకేతికత కలిగిన ఎల్-1 ఆర్డీ పరికరాలు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచించింది. ఈ మేరకు కూటమి ప్రభుత్వం వాటిని కొనుగోలు చేసి సచివాలయాలకు అందజేసింది.

• ఏప్రిల్ నుంచి వినియోగం..

కొత్తగా అందజేసిన ఎల్-1 ఆర్డీ స్కానర్ పరికరాలతోనే ఏప్రిల్ నుంచి పింఛన్లు అందించనున్నారు. వీటిలో యూఐడీఏఐ ఆధార్ సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించింది. దీంతో ప్రస్తుతం ఉన్న పాత పరికరాలు పనిచేయవని ఆ సంస్థ ఇప్పటికే స్పష్టం చేసింది. జిల్లాలోని సచివాలయ సిబ్బందికి 6400 స్కానర్లను పంపిణీ చేశారు. తొలుత ఎంపీడీవోలకు పంపి, తర్వాత సచివాలయం సిబ్బందికి అందజేశారు. మిగిలినవి అధికారుల వద్ద ఉంటాయి. ఏ సచివాలయంలోనైనా పరికరం పని చేయక పోతే వాటి స్థానంలో కొత్తవి ఇచ్చేలా అధికారులు నిర్ణయించారు.



ఎల్-1 స్కానింగ్ పరికరాలు

ఏర్పాట్లు చేశాం



ఆధునిక సాంకేతికత కలిగిన ఎల్-1 స్కానర్లు జిల్లాకు వచ్చాయి. వీటిని సచివాలయాలకు పంపిణీ చేశాం. ఏప్రిల్ నుంచి వీటి ద్వారానే పింఛన్లు పంపిణీ చేయిస్తాం. ఎక్కడైనా పరికరం పనిచేయకపోతే వెంటనే కొత్తది అందజేస్తాం. పింఛన్లు అనుకున్న రోజు అనుకున్నట్లు అందజేసే ఏర్పాట్లు చేశాం.

- నాగరాజకుమారి, డీఆర్‌డీఏ పీడీ




విజయవాడలో జరిగిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్

నేడు జిల్లాపై సీఎం సమీక్ష

యాక్షన్ ప్లాన్‌ను వివరించనున్న కలెక్టర్

తొలిరోజు కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ లక్ష్యాలపై దిశానిర్దేశం

నెల్లూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రగతి, ప్రణాళికలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం సమీక్షించనున్నారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో తొలిరోజు మంగళవారం ప్రభుత్వ లక్ష్యాలను దిశానిర్దేశం చేసిన సీఎం రెండోరోజు జిల్లాలపై సమీక్షించనున్నారు. ఇందులోభాగంగా జిల్లాలో సాధించిన ప్రగతి, రానున్న ఏడాదిలో నిర్ధేశించుకున్న లక్ష్యాలు, ప్రధాన అంశాలపై కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా సీఎంకు వివరించనున్నారు. ఆ తర్వాత జిల్లా గురించి ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా యాక్షన్ ప్లాన్‌ను తయారు చేశారు. అందులో వ్యవసాయం, హార్టికల్చర్, ఫిషరీస్, లైవ్‌స్టాక్, ఫారెస్ట్, మ్యాన్యుఫాక్చరింగ్, ఎలక్ట్రిసిటీ, నీటి సరఫరా, నిర్మాణ రంగం, మైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ట్రాన్స్‌పోర్ట్, విద్య, ఆరోగ్యం, రియల్ ఎస్టేట్, సంక్షేమం, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ విజన్ ప్లాన్‌ను ప్రజంట్ చేయనున్నారు. ఈ రంగంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు, వాటిని అమలు చేసేందుకు పెట్టుకున్న సమయం వంటి వివరాలను వివరించనున్నారు. అదేవిధంగా రానున్న ఏడాదిలో 15 శాతం గ్రోత్ సాధించేందుకు తీసుకుంటున్న చర్యలను కూడా తెలియజేయనున్నారు. అలానే మరో ఐదు నిమిషాలపాటు జిల్లాలోని ప్రధాన సమస్యలపై కూడా కలెక్టర్ మాట్లాడేందుకు అవకాశమిచ్చారు.



• తలసరి ఆదాయంపై..

కాగా తొలిరోజు జరిగిన కాన్ఫరెన్స్‌లో రానున్న ఏడాదిలో సాధించాల్సిన లక్ష్యాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. జిల్లా సాధించాల్సిన ప్రగతి వివరాలను కలెక్టర్‌కు అందజేశారు. జిల్లా స్థూల ఉత్పత్తి ఉత్పత్తి 2023-24లో రూ.69,491 కోట్లు ఉండగా 2024-25లో 79,532 కోట్లుగా నమోదైనట్లు అంచనా వేశారు. అంటే ఈ ఏడాది జీడీపీ 14.45 శాతం పెరిగింది. రానున్న ఆర్థిక సంవత్సరం 2025-26లో జీడీపీని రూ.92,705 కోట్లకు పెంచి 16.56 శాతం గ్రోత్ సాధించాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. ప్రస్తుతం రాష్ట్ర జీడీపీలో జిల్లా వాటా 4.99 శాతం ఉండగా, రానున్న ఏడాదిలోనూ పురోగతి సాధించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఇక జిల్లాలో తలసరి ఆదాయం 2023-24లో రూ.2,33,411 ఉండగా, 2024-25లో అది రూ.2,66,818లకు పెరిగింది. రానున్న ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయాన్ని రూ.3,10,214లకు పెంచాలని ప్రభుత్వం సూచించింది. తొలిరోజు కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆనంద్‌తో పాటు ఎస్పీ కృష్ణకాంత్ కూడా పాల్గొన్నారు. కాగా ఈ సదస్సును నెల్లూరులోని కలెక్టరేట్ నుంచి జేసీ కే కార్తీక్ వీక్షించారు.

• కోవూరు షుగర్ ఫ్యాక్టరీపై..

కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయిలు చెల్లించడం, అక్కడున్న 124 ఎకరాల భూమిని వినియోగించడం అనే అంశాన్ని తొలుత వివరించనున్నారు. ప్రస్తుతం విజిలెన్స్ విచారణ నేపథ్యంలో కొన్ని ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయి ఉన్నాయని, వాటిని పూర్తి చేసేందుకు అనుమతి ఇవ్వాలని కూడా కలెక్టర్ సీఎంను కోరనున్నారు. సోమశిల ఆప్రాన్ పనులు, హైలెవల్ కెనాల్ భూసేకరణను పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల గురించి కూడా ప్రస్తావించనున్నారు. వీటితోపాటు తమిళనాడు మత్స్యకారుల పెద్ద బోట్లతో జిల్లాలోని మత్స్యకారులకు ఎదురవుతున్న ఇబ్బందులను కూడా కలెక్టర్ మాట్లాడనున్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను త్వరగా పూర్తి చేసి ఆపరేషన్‌లో తీసుకొచ్చే అంశాన్ని కూడా ప్రస్తావించనున్నారు. కలెక్టర్ ప్రెజంటేషన్ తర్వాత ఈ అంశాలన్నింటిపై సీఎం సమీక్షించనున్నారు.

వీఎస్‌యూ పీజీ కళాశాలలో విచారణ

• ప్రొఫెసర్లు, విద్యార్థినులతో మాట్లాడిన కమిటీ • విచారణను నీరుగార్చేందుకు విశ్వప్రయత్నాలు

కావలిటౌన్, (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూ పరిధిలోని పీజీ కళాశాలలో ఐదుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీ మంగళవారం విచారించింది. మహిళా అధ్యాపకుల పట్ల ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనుచితంగా ప్రవర్తించడం, మహిళల హాస్టల్‌లోకి ప్రవేశించడంపై పెద్ద దుమారమే రేగింది. ఈ వ్యవహారంపై విచారణ కమిటీని నియమించగా, విచారణకు కాలయాపన చేశారు. చివరకు మంగళవారం కమిటీ సభ్యులు కళాశాలకు చేరుకుని మహిళా అధ్యాపకులు, విద్యార్థినులతో మాట్లాడారు. అధ్యాపకుడిపై ఆరోపణలు నిజమేనని కమిటీ ముందు వారు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయితే కళాశాల పెద్దలు మాత్రం అధ్యాపకుడిని కాపాడేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అధ్యాపకుడికి అనుకూలంగా కొంతమంది విద్యార్థినులను కమిటీ ముందు హాజరుపరిచినట్లు తెలుస్తోంది. కాగా, విచారణలో తమ దృష్టికి వచ్చిన అంశాలను నివేదిక రూపంలో వీఎస్‌యూ అధికారులకు అందజేస్తామి కమిటీ సభ్యులు స్పష్టం చేశారు.

పాఠశాలల అభివృద్ధికి నిధులు

• మనబడి-మనభవిష్యత్తు పనులకు మోక్షం • జిల్లాకు రూ.39.36 కోట్ల కేటాయింపు


నెల్లూరు (విద్య), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులను (మనబడి-మనభవి ష్యత్తు) పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా జిల్లాలో రెండవదశలో పెండింగ్‌లో ఉన్న పనుల పూర్తికి జిల్లాకు రూ.39.36 కోట్లు కేటాయిం చారు. జిల్లాలోని పాఠశాలల్లో రెండవ దశలో 1400 పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులను ప్రారంభించి పూర్తి చేయ డానికి పాఠశాల విద్యాశాఖ నివేదికలను కోరింది. దీంతో కొన్ని పాఠశాలల్లో నిర్మిం చిన అదనపు తరగతి గదులకు ప్లాస్టింగ్ చేసి పెయింటింగ్ చేయాలని, మరికొన్ని చోట్ల తలుపులు, కిటికీలు బిగించాల్సి ఉందని, అలాగే పారిశుధ్యపనులు, విద్యుత్ క్రమబద్ధీకరణ ఇలా పలు పనులకు సంబంధించి నివేదికలు తయారు చేసి పంపారు. గత వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు చెల్లించకపోవడం, పనుల్లో నాణ్యత లేదని కొన్నిచోట్ల ఆపివేయడం వంటి అంశాలతో కాంట్రాక్టర్లు మధ్యలోనే వదిలి వెళ్లిపోవడంతో చాలా వరకు అసంపూర్తిగా భవనాలు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల పాఠశాలల అభివృద్ధి కమిటీ ఖాతాల్లో ఉన్న నిధులతో చిన్నచిన్న పనులు ప్రారం భించినా నిధులు అయిపోవడంతో ఈ పనులు కూడా ఆగిపోయినట్లు అధికారులు తెలిపారు. ఈ మొత్తం నివేదికల ఆధారంగా రాష్ట్ర ఉన్నతాధికారులు అన్ని జిల్లాలతో పాటు నెల్లూరుకు రూ.39.36 కోట్లు కేటా యించారు. అడ్మిన్ శాంక్షన్ మాత్రమే అయిన ఈ నిధులను ఫైనాన్స్ శాంక్షన్ కింద జిల్లాకు విడుదల చేస్తే అసంపూర్తి భవనాలు పూర్తి చేసి రానున్న విద్యాసంవత్సరంలో పాఠశాలలను వినియోగంలోకి తెస్తామని ఏపీసీ వెంకటసుబ్బయ్య తెలిపారు.

28 నుంచి ఎయిడెడ్ పోస్టులకు ఆన్‌లైన్ పరీక్ష

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు ఈనెల 28, 29 తేదీల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు ఓ ప్రకట నలో పేర్కొన్నారు. నెల్లూరులోని కస్తూరిదేవి బాలికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ 2, బయలాజికల్ సైన్స్ 1, ఫిజికల్ సైన్స్ 1, హిందీ 1, ఎస్‌జీటీ 2 పోస్టులు ఉన్నా యని తెలిపారు. గూడూరులోని శ్రీపొట్టిశ్రీరాములు అప్పర్‌ప్రైమరీ స్కూల్‌లో ఎస్‌జీటీ 1, లాంగ్వేజ్ పండిట్ హిందీ 1, తెలుగు 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు cse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టి కెట్లు డైన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఆఫ్‌లైన్‌లో ఆయా పాఠశాలల యాజమాన్యానికి ఇచ్చిన దరఖాస్తులకు కూడా డీఈవో అనుమతితో హాల్‌టికెట్లు పొందాలని సూచించారు.

అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హనుమాన్‌జంక్షన్‌లో వెలసి ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి వేకువజామున పంచామృతాభిషేకం, అనంతరం సహస్రనామార్చన, ఆకుపూజ చేసి హనుమాన్‌చాలీసా పఠించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.



బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8448
వెండి కిలో ధర	రూ. 1,00,500
వెండి ఒక గ్రాము	రూ.103.50

న్యూస్ బాక్స్

29 మందికి ఉద్యోగాలు

ఉదయగిరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ కార్యాలయం, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. కార్యక్రమానికి 53 మంది హాజరు కాగా 29 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.నారాయణస్వామి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్‌ఖయ్యూం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కాకర్ల రాక

ఉదయగిరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బుధవారం ఉదయగిరికి రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ సీహెచ్. బయ్యన్న మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తొలుత మండల పరిషత్ కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం స్త్రీశక్తి భవనంలో జరిగే మండల సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో గ్రీవెన్స్‌డే నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

ఇంటింటా చెత్త సేకరణ

కలువాయి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలువాయి, చింతలాత్మకూరు, దాచూరు, పర్లకొండలో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమం ప్రారంభమైనట్లు మండల పంచాయతీల విస్తరణ అధికారి రమేష్ తెలిపారు. మంగళవారం కలువాయిలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌తో కలసి ఆయన పరిశీలించారు. చెత్తసేకరణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

పోక్సో చట్టంపై అవగాహన

ఉదయగిరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లిలో మంగళవారం ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి అంజయ్య పోక్సో చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పోక్సో చట్టంలో కేసు నమోదైతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని వివరించారు. ఈ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణలో భాగస్వాములు కండి



చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ

సీతారామపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గంగవరంలో గ్రీన్ అంబాసిడర్స్ ప్రతి ఇంటికి వెళ్తున్నారా.. లేదా ? అని మంగళవారం ఈవోపీఆర్డీ భార్గవి తనిఖీ చేశారు . ప్రజలకు ఐవీఆర్ఎస్ కాల్స్ పట్ల అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యర్థాల నిర్వహణలో భాగస్వాములు కావాలని తెలిపారు.

బాధ్యతగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న ఎస్ఆర్పీ నీలకంఠ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సామాజిక తనిఖీలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఆర్పీ నీలకంఠ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 16వ విడత సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో విచారణ చేపట్టిందన్నారు. అప్పట్లో విధులు నిర్వహించిన ఉద్యోగులు, క్షేత్రసహాయకులు తప్పని సరిగా అందుబాటులో ఉండి, తనిఖీ బృందానికి సహకరించాలన్నారు. అనంతరం డీఆర్పీలకు పంచాయతీలను కేటాయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, ఏపీవో ఆజమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరం

సీతారామపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఓరల్ హెల్త్ డే సందర్భంగా డాక్టర్ ఏ. స్వప్న ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని పడమటివీధి ప్రాథమిక పాఠశాలలో దంత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు దంత వైద్యురాలు అనీస్ సల్మా పరీక్షలు నిర్వహించారు. దంత సమస్యలు ఉన్న విద్యార్థులను సీతారామపురం, ఉదయగిరి ఆసుపత్రులకు రెఫర్ చేశారు.అనంతరం విద్యార్థులకు టూత్ పేస్టు,బ్రస్సులు అందజేశారు కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల భవితకు భరోసా

కేజీబీవీలో పేద విద్యార్థినులకు అవకాశం

ప్రవేశానికి ఏప్రిల్ 11 వరకు దరఖాస్తులు

ఉదయగిరి/ మర్రిపాడు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలకు(కేజీబీవీ) శ్రీకారం చుట్టారు. ఈ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమం బోధనతోపాటు అన్నీ సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీంతో పలువురు తల్లిదండ్రులు కేజీబీవీల్లో తమ పిల్లలను చేర్పేందుకు పోటీ పడుతున్నారు. ప్రస్తుతం ఒక్కడ ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఏప్రిల్ 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

● బాలికల భవితకు చక్కని అవకాశం

జిల్లాలో సీతారామపురం, నందిపాడు, ఏఎస్‌పేట, మర్రిపాడు, కలిగిరి, కొండాపురం, కావలి, గుడ్లూరు, కందుకూరు, ఉలవపాడు, లింగసముద్రం, వీవీపాళెంలో కేజీబీవీలు ఉన్నాయి.బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పాఠశాలలు ఇవి. అందులోనే వసతి సౌకర్యం ఉంది. నందిపాడు, ఏఎస్‌పేట, గుడ్లూరు, లింగసముద్రంలో బైపీసీ, ఉలవపాడు, కందుకూరు, వీవీపాళెం, సీతారామపురం, కొండాపురం, కావలిలో ఎంపీసీ, మర్రిపాడు, కలిగిరిల్లో ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆరో తరగతిలో 40, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయి. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే అధికారులు ఎంపిక చేస్తారు. ప్రధానంగా బడిమానేసిన పిల్లలు, తల్లిదండ్రులు లేని పిల్లలు, తల్లి/తండ్రి లేని పిల్లలకు ప్రాధాన్యత ఇచ్చి అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓపెన్ కేటగిరి పిల్లలకు అవకాశం కల్పిస్తారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఒకే ఆవరణలో ఆంగ్లమాధ్యమంలో చదువుకునే అవకాశం. ఐఎఫ్‌పీ, ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన చేయడం, పాల్ ట్యాబ్ ల్యాబ్ తరగతులు నిర్వహించడం, ప్రతిరోజు యోగా తరగతులతోపాటు ఆరోగ్య వ్యాయామ విద్య, క్రీడలు విద్యాలయం ప్రత్యేకత. దీంతోపాటు బాలికలకు ఈ పాఠశాలలు అత్యంత సురక్షిత కేంద్రాలు.

● మర్రిపాడులోని కేజీబీవీలో 9వ తరగతిలో 40 మంది, ఇంటర్ మొదటి సంవత్సరంలో 37మంది ఉండగా, వేసవి సెలవులకు ఇళ్లకు వెళ్లే ముందే 9వ తరగతి విద్యార్థినులకు టెన్త్ పాఠాలపై ప్రాథమిక అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమం ఈనెల 10నుంచి ప్రారంభమైంది. నెలాఖరు వరకు కొనసాగనుంది. ఎప్పటి కప్పుడు స్లిప్ టెస్టులు పెడుతూ మరోమారు జూన్ 12 నుంచి 14వరకు పరీక్ష నిర్వహిస్తారు. ద్వితీయ ఇంటర్ వారికి పాఠాలను ఏప్రిల్ 1నుంచి 23వరకు బోధించ నున్నారు.



ఉదయగిరి మండలం నందిపాడులోని కేజీబీవీ



మర్రిపాడు కేజీబీవీలో తొమ్మిదవ తరగతి విద్యార్థినులకు పాఠం చెబుతున్న ఉపాధ్యాయురాలు

సద్వినియోగం చేసుకోవాలి

కేజీబీవీల్లో ఆరో తరగతి, ఇంటర్‌లో చేరేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మంచి భోజనంతోపాటు నాణ్యమైన విద్యనందిస్తారు. పేద విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- వెంకటసుబ్బయ్య, ఏపీసీ, ఎస్ఎస్ఏ

సరైన ప్రణాళికతో ముందుకు...



విద్యార్థినులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు సరైన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. పరీక్షలు నిర్వహించి వారి వారి సామర్థ్యాలను గమనిస్తున్నాం.

- ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, మర్రిపాడు, కేజీబీవీ





కల్యాణోత్సవంలో ఉత్సవమూర్తులు, కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కమనీయం.. శ్రీనివాస కల్యాణం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైకుంఠపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీనివాస కల్యాణాన్ని రమణీయంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు పెండ్యాల సూర్యనారాయణ-అమ్మాజీ దంపతుల ఆధ్వర్యంలో తొలుత స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అశోక్‌నగర్‌కి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వడ్లమూడి నాగేంద్రబాబు-లక్ష్మీశిరీష, హరికృష్ణ-జ్యోత్స్న దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు పవన్‌కుమార్

కలువాయి, మార్చి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోపుగుంటలో మంగళవారం మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పవన్‌కుమార్ శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనగలుకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటం రూ. 5650గా నిర్ణయించిందని, కొనుగోలు కేంద్రాలకు విక్రయించి రైతులందరూ మద్దతు ధర పొందాలని కోరారు. సమావేశంలో వ్యవసాయాధికారి వీ.ప్రతాప్, నాయకులు గోనుగుంట వెంకటేశ్వర్లునాయుడు, చల్లా రఘురామిరెడ్డి, జగదల్‌నాయుడు, గడ్డం కిషోర్‌రెడ్డి, హరిబాబునాయుడు, నాపా మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.


పేరారెడ్డిపల్లెలో చద్ది కార్యక్రమం



చద్ది కార్యక్రమంలో వేపమండలతో మహిళలు, చిన్నారులు

ఆత్మకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని పేరారెడ్డిపల్లి బీసీకాలనీలో శ్రీరామనవమి ఉత్సవాలకు కొద్దిరోజులు ముందుగా చద్ది కార్యక్రమాని నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాలనీలోని మహిళలు, పిల్లలు ముందురోజు రాత్రి వారి ఇళ్లల్లో పెరుగు, అన్నం కలిపి పెట్టిన చద్దిఅన్నాన్ని కాలనీలో ఒకచోటుకు తెచ్చిపెట్టి పూజ చేశారు. అనంతరం అందరూ కలిసి ఆ చద్దిని ప్రసాదంగా తీసుకున్నారు. అనంతరం వేపమండలు చేతబూని ఉత్సాహంగా గ్రామ పొలిమేర వద్దకు వచ్చి అమ్మవారికి దండం పెట్టుకుని వెళ్లిపోయారు. ఇలా వరసగా ఐదు మంగళవారాలపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ.

ఎన్యూమరేటర్లదే కీలకపాత్ర



మాట్లాడుతున్న ఏపీఎం ఖాజారంతుల్లా

ఉదయగిరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గ్రామ సమాఖ్య, పొదుపు సంఘాలను పటిష్ట పరచడంతో ఎన్యూమరేటర్లదే కీలకపాత్రని ఏపీఎం ఖాజారంతుల్లా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య ఈసీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ సమాఖ్యకు ఐదుగురు ఎన్యూమరేటర్లను నియమించామన్నారు. వీరు గ్రామాల్లో సంఘాల పనితీరు, రుణాల రికవరీ, మంజూరులను పర్యవేక్షిస్తారన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రుణాల మంజూరు, రికవరీల్లో లక్ష్యాలు అధిమించామన్నారు. సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సీసీలు అనిల్, శ్రీనివాసులు, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఉప తనిఖీ అధికారి ఖాజామోహిద్దీన్

సంగం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉర్దూ ప్రాథమిక పాఠశాలను జిల్లా ఉర్దూ పాఠశాల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజామోహిద్దీన్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఎస్ఏ -2 పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనలో నాణ్యతగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం. ఎస్‌కె నయీం పాల్గొన్నారు.

ఉదయగిరిలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న హిందూ, ముస్లింలు

ఉదయగిరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక షాదీమంజిల్‌లో మంగళవారం జమాయితే ఇస్లామిక్ హింద్ ఆధ్వర్యంలో హిందూ, ముస్లింకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ ఖురాన్ ఆవశ్యకత, రంజాన్ ఉపవాసాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు రియాజ్, బయ్యన్న, వైసీపీ నేత ఓబులరెడ్డి, వైద్యులు వేణుగోపాల్, శివరాం, ఎస్ఐవో, ఐవోఎం సభ్యులు సిద్దిఖ్, లియాఖత్, సందానీ, ఇందాదుల్లా, అజరుల్లా, మునాఫ్, మసూద్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

అడవులను కాపాడుకుందాం..



అడవుల పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

ఉదయగిరి రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడలో కీలకంగా మారిన అడవులను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఉదయగిరి అటవీశాఖ రేంజ్ అధికారి బీ.ఎస్ కుమార్‌రాజా అన్నారు. మంగళవారం రాత్రి చెరువుపల్లి, చెర్లోపల్లి, తిమ్మాయపాళెం గ్రామాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అడవులకు నిప్పు పెట్టడం, నరకడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎర్రచందనం తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచి సమాచారం అందజేయాలన్నారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పిస్తూ నెల్లూరుకు చెందిన కళాజాతా బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ఉరేసుకుని వ్యక్తి మృతి

వెంకటాచలం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భార్యభర్తల మధ్య మనస్పర్థలతో అనికేపల్లికి చెందిన వెంకటసుబ్బయ్య (46) మంగళవారం ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందాడు. పోలీసుల కథరం మేరకు.. నాయీ బ్రాహ్మణుడు అయిన ఈయన కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై కుటుంబాన్ని సరిగా పట్టించుకోక పోవడంతో భార్యభర్తల మధ్య మనస్పర్థలు చోటుచేసుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

లాడ్జిలో ఒకరు....

నెల్లూరు(క్రైం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని సీపీఆర్ రెసిడెన్సీ లాడ్జిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని మూలాపేట అలంకార్ సెంటర్‌కు చెందిన చల్లా పెంచల కుమార్ వహాబ్‌పేటలోని సీపీఆర్ రెసిడెన్సీ లాడ్జిని నడుపుతున్నారు. ఈ నెల 19వ తేదీ చెన్నై నుంచి రోహన్ అనే వ్యక్తి లాడ్జికి వచ్చి ఆధార్ కార్డు నెంబరు చెప్పి రూమ్ అద్దెకు తీసుకున్నాడు. అప్పటి నుంచి అతను రూమ్‌లో ఉంటూ పెయింట్ పనులకు వెళ్లి వస్తుండేవాడు. సోమవారం సాయంత్రం రోహన్ ఆరోగ్యం బాగలేదని చెప్పి జయభారత్ వైద్యశాలకు వెళ్లి వచ్చాడు. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో రూమ్ నుంచి బయటకు వచ్చి తిరిగి రూమ్‌లోకి వెళ్లాడు. రూమ్‌బాయ్ ఉదయం 8 గంటల సమయంలో తలుపులు తట్టగా రోహన్ పలకలేదు. కిటికీలో నుంచి చూడగా రోహన్ బెడ్ ప్రక్కనే నేలపై పడి ఉన్నాడు. దీంతో అందరూ కలిసి తలుపును గట్టిగా నెట్టి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 సిబ్బంది రోహన్‌ను పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. దీంతో లాడ్జి యజమాని చిన్నబజా రు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

బాత్రూమ్‌లో జారిపడి గాయపడ్డ వృద్ధుడు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని శెట్టిగుంటరోడ్డులో నివసించే కే కోటేశ్వరరావు(65) కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. సోమవారం ఆయన ఇంట్లో బాత్రూమ్‌లో జారిపడటంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. కోటేశ్వరరావు కుమారుడు శివ మంగళవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

లైన్‌మన్ మృతికి సంతాపం



పాండురంగయ్య (ఫైల్)

రాపూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న రేలంగి పాండురంగయ్య మంగళవారం సాయంత్రం చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆయన బంధుమిత్రులు తెలిపారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామం చేజర్ల మండలం, కొలపనాయుడుపల్లిలో బుధవారం జరుగుతాయని వారు తెలిపారు. పాండురంగయ్య మృతి పట్ల సహోద్యోగులు, విద్యుత్ సిబ్బంది దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

సిమెంట్ లారీ బోల్తా : డ్రైవరుకి గాయాలు



బోల్తా పడిన సిమెంట్ లారీ

రాపూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండవోలు గ్రామ సమీపాన ఉన్న మలుపు వద్ద మంగళవారం వేకువ జామున సిమెంట్ లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవరుకి గాయాలయ్యాయి. ఆనంతపురం నుంచి గూడురుకు సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారించారు. అతివేగం, నిద్రలేమి కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా వారు నిర్ధారించారు.

పురుగు మందు దుకాణాలపై

విజిలెన్స్ అధికారుల దాడులు

పొదలకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):తాటిపర్తిలోని వెంకటేశ్వర ఫర్టిలైజర్స్‌అండ్ పెస్టిసైడ్స్ దుకాణంపై మంగళవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, మండల వ్యవసాయాధికారితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో ఈ-పాస్ మిషన్, గోడౌన్ నిల్వలో తేడాలను గమనించి 344 బస్తాల ఎరువులను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఎరువుల విలువ రూ.2.93లక్షలని తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ ఏఓ వేణుగోపాల్ రావు, విజిలెన్స్ సీఐ నర సింహారావు, ఏసీటీవో విష్ణురావు, ఎంఏవో ఏ.వాసు తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు కృషి చేయాలి

● ఆర్పీఎఫ్ ఐజీ అరోమా సింగ్ ● నెల్లూరు ఆర్పీఎఫ్ స్టేషన్ తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న ఐజీ ఆరోమా సింగ్ ఠాకూర్

నెల్లూరు(క్రైం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రైల్వే పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే పోలీసు ఐజీ, ఆర్పీఎఫ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూరు ఆ దేశించారు. నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో ఉన్న ఆర్పీఎఫ్ పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఉద్యోగంలో మెల కువలపై అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. విధుల్లో నిర్ల క్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. స్టేషన్ ప్రాంగణం లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ విజయవాడ సీ నియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ వల్లేశ్వర బాపూజీ తోకల, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ జీ మధుసూదనరావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పీ రమేష్‌గౌడ్, ఎస్ఐ శివరూపావత్, ఏఎస్ఐలు కిరణ్‌కుమార్, రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

వేసవిలో దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు(క్రైం, ఆంధ్రజ్యోతి): వేసవిలో రైలు ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుంది, కావున దొంగతనాలు జరిగేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నందున జీఆర్‌పీఎస్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని రైల్వే డీఎస్పీ జీ మురళీధర్ ఆదేశించారు. నగరంలోని రైల్వే డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన నెలవారీ నేర సమీక్ష జరిపారు. స్టేషన్ ప్లాట్‌ఫాంలపై బీట్ల సంఖ్య పెంచి, దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రైళ్లలో కిటికీల పక్కన కూర్చొని ప్రయాణించే మహిళలకు దొంగతనాలపై అవగా హన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఎస్ఐ రమాదేవి, నెల్లూరు ఎస్ఐ హరిచందన, గూడూరు ఎస్ఐ చెన్నకేశవులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	111
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224

కోడిగుడ్ల ధర (100): 470



70 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

గుడ్లూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూరేటిపల్లి నుంచి కావలికి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం, మినీ వాహనాన్ని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు పూరేటిపల్లి సమీపంలో 70 బస్తాల రేషన్ బియ్యా న్ని తరలిస్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో అందులో ఉన్నవి రేషన్ బియ్యంగా గుర్తించారు. బియ్యంతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆ వాహనంలో ఉన్న శివకుమార్, నరసింహం, శివారెడ్డిలను అదుపులోకి తీసుకొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకట్రావు తెలిపారు.

రీ సర్వేలో తప్పులు చేస్తే చర్యలు : ఆర్డీవో



తహసీల్దారు కార్యాలయంలో రీ సర్వేపై సమీక్షిస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

కావలి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేలో తప్పు చేసినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణ హెచ్చరించారు. కావలి తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం మండలంలోని రుద్రకోటలో జరుగుతోన్న రీ సర్వేకు సంబంధించి కావలి తహసీలారు పీ.శ్రావణ్‌కుమార్, రీసర్వే డీటీ, డివిజనల్, మండల, సచివాలయ సర్వేలతో పాటు ఆగ్రామంలో పాల్గొంటున్న వీఆర్వోలతో ఆయన సమీక్షించారు. రీసర్వే ఎలా జరుగుతోంది.. ఎంత పూర్తి చేశారు.. ఎదురవుతున్న సమస్యలు.. వాటిని అధిగమించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై చర్చించారు. గతంలో జరిగిన రీ సర్వేలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సమయం ఎక్కువ ఉన్నందున ఎక్కడా లోపాలు, ఫిర్యాదులు రాకుండా సర్వే నిర్వహించాలన్నారు. రీసర్వే సమయంలో అందుబాటులో లేని రైతులను రెండు పర్యాయాలు రమ్మని పిలిచి వారు రాలేకపోతే వారి తరుపున లిఖిత పూర్వకంగా వారి అనుచరులను పంపమని చెప్పి తద్వారా సర్వే పూర్తి చేయాలని చెప్పారు.

ఆధార్‌కార్డులు ఇప్పించండి సారూ..

ఆధార్‌కార్డులు ఇప్పించండి సారూ.. మునునూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన గిరిజనులు ఆర్డీవో ఎం. సన్నీవంశీకృష్ణను వేడుకున్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు ఆధార్ కార్డులు లేనందున ప్రభుత్వ పథకాలు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఆర్డీవో పక్కనే ఉన్న తహసీల్దారు పీ.శ్రావణకుమార్‌తో ఆధార్ కార్డులు లేని వారిని గుర్తించి కార్డులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

పంచాయతీ సమావేశం వాయిదా



పంచాయతీ సమావేశంలో పాల్గొన్న అధికారులు, సర్పంచు మాల్యాద్రి, తదితరులు

కొండాపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవోలు పంచాయతీ సాధారణ సమావేశం ఎప్పటిలాగే వార్డు సభ్యుల గైర్హాజరుతో వాయిదా పడింది. ఈ పంచాయతీకి గతంలో జరిగిన ఎన్నికల్లో మొత్తం 10 వార్డులకు 8 వార్డుల్లో టీడీపీ మద్దతు దారులు విజయం సాధించగా, మిగిలిన 2 వార్డులతో పాటు పంచాయతీ సర్పంచుగా వైసీపీ మద్దతు దారులు గెలుపొందారు. దీంతో సర్పంచు సమావేశాలు నిర్వహించకనే ఏకపక్షంగా తీర్మానాలు చేసుకుని వార్డు సభ్యులను సంతకాలు పెట్టమనేవారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈక్రమంలో గత కొంతకాలంగా పంచాయతీ సాధారణ సమావేశాలు జరగలేదు. ఈ విషయాన్ని సర్పంచు మాల్యాద్రి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పంచాయతీ సమావేశం జరిగేలా చూడాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ఈవోపీఆర్డీ నారాయణరావు, ఏవో శేషసాయి, పంచాయతీ కార్యదర్శి ధనుంజయ్‌లు సర్పంచు అధ్యక్షతన స్థానిక సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కూడా వార్డు సభ్యుల రాకపోవడంతో కోరం లేక వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులు, ఎంపీటీసీ వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మార్పు కోసం ‘నవోదయం 2.0’



తహసీల్దారుతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు

బిట్రగుంట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చి దిద్దేందుకు నవోదయం 2.0ను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం బోగోలు తహసీల్దారు కార్యాలయంలో నవోదయం 2.0 కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు తహసీల్దారు సురేష్‌బాబు అధ్యక్షతన నాటుసారా నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించాల్సిన విధానాలపై చర్చించారు. ఈ కార్య క్రమంలో కమిటీ సభ్యులు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఏఎస్ఐ కోటేశ్వరావు, కావలి అటవీశాఖాధికారి సుమన్, లోకాయుక్త సభ్యులు మాలకొండారెడ్డి, ఆకుల డేవిడ్‌పాల్, సాల్మన్‌రాజు, నాగేశ్వరావు, వెలుగు ఏపీవో తదితరులు పాల్గొన్నారు.

‘ఆర్టీసీ’లో రక్షణ కరువు!

- నిత్యం అల్లరి మూకలు, మందుబాబుల ఆగడాలు
- చీకటి పడితే భయాందోళనలో ప్రయాణికులు
- మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయిలు
- దిష్టిబొమ్మలా పోలీసు అవుట్ పోస్ట్



కావలి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం

కావలి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కావలి ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు దాని పరిసరాలలో ప్రయాణికులకు రక్షణ కరువైంది. నిత్యం అల్లరి మూకలు, మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని ప్రయాణికులు వాపోతున్నారు. దూర ప్రాంతాలకు రాత్రి సమయంలో రాపోకలు సాగించే ప్రయాణికులు ఆకతాయిల ఆగడాలతో హడలిపోతున్నారు. ముఖ్యంగా మహిళల పట్ల వీరు వ్యవహరిస్తున్న తీరు జుగుప్సాకరంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజుల కిందట అర్ధరాత్రి బస్టాండ్‌లో ఉన్న ఒక టీ దుకాణంలో సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టనివ్వలేదని దుకాణ నిర్వాహకుడిని ఐదుగురు యువకులు చితకొట్టారు. ఆ విషయం డిపోలో ఉన్న నిఘా కె మెరాలలో దొరకి అవి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆ ఐదుగురి యువకులపై ఒకటో పట్టణ పోలీస్‌లు కేసు నమోదు చేశారు. అసలు అర్ధరాత్రి అక్కడ ఐదుగురు యువకులు ఎందుకు చేరారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. గతంలో బస్టాండ్‌లో బస్సుల కోసం కొంత సేపు నిలబడితే జేబులో ఉన్న సెల్ ఫోన్‌లు క్షణాల్లో మాయమయ్యేవి. అయితే సెల్‌పోన్ దొంగలు ఎక్కువైన తర్వాత డిపోలో నిఘా కెమెరాలు ఏర్పాటు చేయడంతో సెల్‌ఫోన్ దొంగలు కొంత తగ్గాయి. అయితే మందుబాబులు, అల్లరి మూక ల ఆగడాలు బస్టాండ్ ఆవరణంతోపాటు దాని పరిసరాలలో ఎక్కువయ్యా యి. చీకటి పడితే కొందరు యువకులు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరి కొందరు యువకులైతే యువతులు కనిపిస్తే వారి వెంట పడి వేధిస్తున్నారనే ప్రచారం ఉంది. మహిళలు ఏమీ చేయలేక సర్దుకుపోతున్నారే కానీ పోలీసులకు ఫిర్యాదులు చేస్తే తమ గౌరవం ఎక్కడ దెబ్బతింటుందోనని వెనుకాడుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని అల్లరి మూకలు, మందుబాబుల ఈవ్‌టీజింగ్ బస్టాండ్ ప్రాంతంలో ఎక్కువైందని చెబుతున్నారు. రాత్రి అయితే బస్టాండ్‌కు వెళ్లాలన్నా, బస్సుల కోసం నిరీక్షించాలన్నా, బస్సు దిగి రావాలన్నా ప్రయాణికులు బిక్కు బిక్కు మంటూ అభద్రతతో ఆందోళన చెందుతున్నారు.



పోలీసులు లేని ఔట్‌పోస్ట్

● దిష్టిబొమ్మలా పోలీసు ఔట్‌పోస్ట్

గతంలో ఆర్టీసీలో పోలీస్‌ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయడంతో పోలీస్‌లు అందుబాటులో ఉంటున్నందున అల్లరి మూకలు, మందు బాబులు అక్కడ తిరగాలంటే భయపడేవారు. ప్రయాణికులకు కూడా పోలీసులు ఉన్నారనే ధైర్యం ఉండేది. అయితే ప్రస్తుతం అక్కడ పోలీస్ ఔట్‌పోస్ట్ ఉంది కానీ పోలీసులు మాత్రం ఉండడం లేదు. దీంతో అది దిష్టిబొమ్మలా మారింది. ఫలితంగా రెచ్చిపోతున్న ఆకతాయిలు, మందు బాబుల నుంచి ప్రయాణికులకు రక్షణ కరువైంది.

పోలీసు అధికారులు స్పందించలేదు

బస్టాండ్‌లో అల్లరి మూకలు, మందుబాబులు ఆగడాలు ఎక్కువైంది వాస్తవమే. అయితే ఈ విషయం పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పోలీసు ఔట్‌పోస్ట్‌లో సిబ్బందిని నియమించి ప్రయాణికులకు రక్షణ కల్పించాలని కోరినా స్పందనలేదు.

- ఆర్ శ్రీనివాసులు, డిపో మేనేజరు

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దండి



చీమలపెంటలో తడి, పొడి చెత్తపై వివరిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

లింగసముద్రం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో క్లాప్‌మిత్రలు ఇంటింటికి తిరిగి తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త సంపద సృష్టి కేంద్రాలకు తరలించి చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఇన్‌చార్జి ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు సూచించారు. మంగళవారం ఆయన పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావుతో కలిసి చీమలపెంట, పెంట్రాల గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి క్లాప్ మిత్రలు తడి పొడి చెత్తను సేకరిస్తున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. క్లాప్‌మిత్రలు ఇంటికి వచ్చినప్పుడు తడి పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

● మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కందుకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్ఏ గౌస్ మాట్లాడుతూ సుందరయ్యనగర్, జనార్దనకాలనీ గిరిజన సంఘం, ఉప్పుచెరువు కాలనీల్లో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టాలని, ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ బోర్లు, బావులు ప్రజలకు ఉపయోగపడేలా మరమ్మతులు చేయించాలని, పెరిగిన పట్టణానికి అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచి రోజువారీ కాలువలను శుభ్రం చేయించటం ద్వారా ప్రజలను దోమల బెడద నుంచి కాపాడాలని కోరారు. కందుకూరు తహసీల్దారు కార్యాలయ ఆవరణలో పెట్రోలు బంకు ఏర్పాటు చేసే ప్రయత్నాలను పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ మేనేజరుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మున్వర్‌సుల్తానా, ఎస్కే మల్లిక, ఎం.పద్మ, ఎస్.పవన్‌కుమార్, టీ.వెంకటరావు, డీఎం రాయుడు, ప్రజలు పాల్గొన్నారు.


జాబ్‌మేళాలో 65 మంది ఎంపిక



నియామకపత్రం అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

కందుకూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. టీఆర్ఆర్ ప్లేస్‌మెంట్ సెల్, ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో 150 మంది నిరుద్యోగులు హాజరుకాగా 65మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సహకారంతో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో హెటిరో డ్రగ్స్, ఎస్బీఐ కార్డ్స్, ఏరిస్ ఆగ్రో లిమిటెడ్, డైకిన్, ఆల్‌టూయిస్ట్, గ్లోబల్ ఫ్యాక్టరీస్ తదితర కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొని ఉద్యోగ నియామకాల ప్రక్రియ నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడ్ ఆఫ్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, ఎన్‌సీసీ కో ఆర్డినేటరు ఇమ్రాజు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు ఏడుకొండలు నరేంద్ర, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పి.రాజగోపాలబాబు పాల్గొన్నారు.

ఎస్ఐ నారాయణకు సన్మానం



ఎస్ఐని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

లింగసముద్రం, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రం ఎస్సైగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎం.నారాయణను టీడీపీ నేతలు మంగళవారం ఘనంగా సన్మానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. శాలువా కప్పి, పుష్పగుచ్చం అందించారు. ఈ కా ర్యక్రమంలో టీడీపీ నాయకులు కండే మాలకొండయ్య, ఆర్ఎంపీ వైద్యులు షేక్ పరేష్, బోడి సురేష్, దాసరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ రాజేశ్వరరావు, ఎస్ఐలు



డ్రోన్‌ల నిఘాను పరిశీలిస్తున్న సీఐ ఫిరోజ్

కావలి రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణకు పట్టణ శివారులోని ఆలయాలు, వ్యాపార సముదాయాలు, పాఠశాలల పరిసరాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని రూరల్ సీఐ జీ.రాజేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని బాలక్రిష్ణారెడ్డినగర్, మునునూరు ఇందిరమ్మకాలనీ శివారు ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఎస్ఐలు తిరుమలరెడ్డి, బాలక్రిష్ణలతో కలసి పర్యటించారు. స్థానికులకు నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఇందిరమ్మకాలనీలోని అక్షర ట్యుటోరియల్స్ వద్దకు వెళ్లి 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. ట్యుటోరియల్స్ కరస్పాండెంట్ జి.శివాంజనేయ రెడ్డికి సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యాలని సూచించారు. అలాగే అపరిచిత వ్యక్తుల అనుమానాస్పద సంచర, అసాంఘీక కార్యక్రమాలపై 9440796337కు సమాచారం ఇవ్వాలని కోరారు.

శివారు ప్రాంతాల్లో డ్రోన్ల వినియోగం

పట్టణ శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు, నేర నియంత్రణకు డ్రోన్ల వినియోగాన్ని ప్రభుత్వం ఉపయోగంలోకి తెచ్చిందని 1వ పట్టణ సీఐ ఫిరోజ్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ శివారు ప్రాంతాల్లో ఎల్లవేళలా నిఘా ఉంచుతామన్నారు. మంగళవారం కావలి పట్టణ పరిధిలోని వెంగయ్యగారిపాలెం, ఆముదాలదిన్నె తదితర శివారు ప్రాతాల్లో డ్రోన్లను ఎగురవేసి పరిశీలించారు. మ్యాన్ పవర్ వినియోగానికి అణువుగాని ప్రదేశాల్లో కూడా వ్యభిచారం, పేకాట, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం నియంత్రణకు సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై నడిచేదెలా?

బిట్రగుంట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ యాదవపాలెం ప్రధాన రోడ్డుపై మురుగు ప్రవహిస్తుండడంతో స్థానికులు ఆమార్గంలో వెళ్లలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. 30 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు, కాలువలు పూర్తిగా దెబ్బతిని మురుగు నీరు రోడ్లపైకి నిల్వ చేరడంతోపాటు దుర్వాసన వెదజల్లుతోంది. పాతహరిజనవాడలో కూడా ఇటువంటి పరిస్థితే నెలకొని ఉందని దళితులు ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యను గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేదని, కూటమి ప్రభుత్వంలోనైనా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



యాదవపాలెం ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

అసంపూర్తిగా ‘నాడు-నేడు’ పనులు

- జడ్పీ హైస్కూల్లో ఆగిన అదనపు గది నిర్మాణం
- ఆదిఆంధ్ర కాలనీ పాఠశాలలో పూర్తికాని ప్రహరీ
- మొగిలిచర్లలో విద్యార్థులకు తప్పని తిప్పలు

లింగసముద్రం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్లలో జడ్పీ హైస్కూల్‌లో, ఆదిఆంధ్ర కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పథకం కింద చేపట్టిన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో రూ.60 లక్షలతో అదనపు తరగతి గదులు, వంటగది, మరుగుదొడ్డి, ఫ్లోరింగ్, కరెంటు వైరింగ్ పనులు చేపట్టారు. అయితే వీటిలో వంటగది, మరుగుదొడ్డి, ఫ్లోరింగ్, కరెంటు వైరింగ్ పనులు పూర్తి చేశారు. అదనపు తరగతి గదులకు పిల్లర్లు వేసి, శ్లాబు వేసి అంపూర్తిగా వదిలేశారు. ఈ పనులన్నింటికీ రూ.45 లక్షలు ఖర్చు చేయగా మిగిలిన నిధులు మంజూరు కాకపోవడంతో గత ఏడాది ఎన్నికలకు ముందు ఈ పనులు నిలిచిపోయాయి. మరుగు దొడ్లకు కూడా పెయింటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే ఆదిఆంధ్ర కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పథకం కింద ప్రహరీ, మరుగుదొడ్డి, పాత తరగతి గదికి మరమ్మతులకు రూ.23 లక్షలు మంజూరు చేశారు. అందులో రూ.10 లక్షలతో మరుగుదొడ్డి, పాత తరగతి గదికి మరమ్మతులు పూర్తి చేశారు. ఆ తరువాత నిధులు విడుదల కాకపోవడంతో ప్రహరీ నిర్మాణం అసంపూర్తిగా నిలిచి పోయింది. ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తలిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



మొగిలిచెర్ల జడ్పీ హైస్కూల్‌లో అసంపూర్తిగా అదనపు తరగతి గది నిర్మాణం



మొగిలిచెర్ల ఆదిఆంధ్ర కాలనీలో అసంపూర్తిగా ప్రహరీ నిర్మాణ పనులు

న్యూస్ బాక్స్

ఆస్తి పన్ను చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీ

కావలి/కందుకూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కావలి, కందుకూరు మున్సిపాలిటీల్లో ఇల్లు, ఖాళీస్థలం పన్నులు ఈనెల 31వ తేదీ లోపు పూర్తిగా చెల్లించే వారికి వడ్డీలో 50 శాతం రాయితీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, కందుకూరు మున్సిపల్ కమిషనర్ కె.అనూష వేర్వేరు ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపుదారులు దగ్గరలో ఉన్న మీ సేవా కేంద్రాల్లో, సచివాలయాల్లో, మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లలో పన్నులు చెల్లించి వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పన్నులు చెల్లింపుదారుల కోసం సెలవుదినాల్లో కూడా పన్నులు చెలించేందుకు కౌంటర్లు తెరిచి ఉంటాయని పేర్కొన్నారు. ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్ ద్వారా కూడా పన్నులు చెల్లించుకోవచ్చునని తెలిపారు.

రెడ్‌క్రాస్ సేవలను విస్తృతపరచాలి

కావలిటౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : రెడ్‌క్రాస్ సేవలు విస్తృత పరచాలని రెడ్‌క్రాస్ కావలి శాఖ అధ్యక్షుడు, ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం రెడ్‌క్రాస్ రక్తనిధి భవనంలో జరిగిన రెడ్‌క్రాస్ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా నడుచుకోవాలన్నారు. అనంతరం పాలక మండలి ఉపాధ్యక్షుడుగా డాక్టర్ బెజవాడ రవికుమార్, చైర్మన్‌గా దాకారపు రవిప్రకాష్, వైస్ చైర్మన్‌గా హరినారపరెడ్డి, కోశాధికారిగా అరికట్ల మధుసూదన్‌రావు, సభ్యులుగా న్యాయవాది గొట్టిపాటి మనోరమ, ఇలీంద్ర శ్రీవాణి, డాక్టర్ శ్రీధర్, దాత ఏ రమేష్‌రెడ్డి, పోషక సభ్యులు మోడరన్ నరసింహారావు, ఓరుగంటి వెంకటేశ్వర్లు, జెనిగర్ల మనోహర్, ప్రవీణ్, బీద లక్ష్మీనంద, ఎస్కే నయీమ్, బెజవాడ ప్రసన్నకుమార్ తదితరులు ప్రమాణ స్వీకారం చేయించారు.

నేడు టీడీపీ ‘కార్యకర్తే అధినేత’ సమావేశం

కందుకూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కార్యకర్తే అధినేత అనే వినూత్న కార్యక్రమంలో భాగంగా కందుకూరు పట్టణ టీడీపీ కార్యకర్తలతో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పట్టణంలోని క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, బూత్‌లెవల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

వలేటివారిపాలెం, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోకూరులో భారతీయ రిజర్వు బ్యాంకు, అవార్డు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ విశ్రాంత మేనేజర్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలని, పొదుపు చేయడం అలవర్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అవార్డు సంస్థ అడ్మిన్ రాజేశ్వరి, సంస్థ ప్రతినిధి శ్రీనివాసులు, ఫైనాన్షియల్ అడ్వయిజర్ శివాజీ, డ్వాక్రా మహిళలు, రైతులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

బిట్రగుంట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరులోని భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీలోని పేదలకు రైల్వే అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ కుందుర్తి రవి తన తల్లి నీలవేణి 23వ వర్ధంతి సందర్భంగా మంగళవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రవి కుటుంబ సభ్యులు రాధ, మైత్రేయి, సురేఖ, బీఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు షేక్.సమీఉల్లా, బిట్రగుంట రైల్వే ఎస్సీ ఎస్టీ యూనియన్ చైర్మన్ బొద్దు శ్రీనివాసులు, సొసైటీ నిర్వాహకులు కట్టేపల్లి భవానీ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో భానుడి ప్రతాపానికితోడు నీటి కాలుష్యంతో పలు రకాల వ్యాధులు ప్రబలుతున్నాయి. ఎండాకాలంలో ప్రధానంగా వడదెబ్బ, అతిసారా, పైయోడెర్మాస్(శరీరంపై గుల్లలు), వైరల్‌ఫీవర్, పచ్చకామెర్లు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటే వాటి బారి నుంచి తప్పించుకోవచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే వేసవిలో వ్యాధులు దరిచేరవని వారంటున్నారు.

- ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)

మండుతున్న ఎండలతో

జాగ్రత్త సుమా!

● వేసవిలో పొంచి ఉన్న వ్యాధులు

● నివారణోపాయాలతో ఉపశమనం

జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఒక వైపు ఎండలు భయపెడుతుంటే, మరోవైపు వేసవి వ్యాధుల ప్రమాదాన్ని తలచుకుని ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

● నీటి వల్లే వ్యాధులు

● వేసవిలో వచ్చేవ్యాధులు అత్యధికంగా నీటి నుంచి వచ్చేవే. అందువల్ల సాధ్యమైనంత వరకు సురక్షితమైన నీటినే తాగాలి.

● కుళాయి, బోరు ప్రాంతాల్లో లీకేజీలను నివారించుకోవాలి. బోర్ల చుట్టూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.

● పైపులైను వాల్వుల వద్ద చెత్తాచెదారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

● వడదెబ్బ లక్షణాలివి...

● ఎండలో ఎక్కువగా తిరిగితే వడదెబ్బ తగులుతుంది. దీంతో శరీర ఉష్ణోగ్రత పెరిగి అపస్మారకస్థితిలోకి వెళ్తారు. ఫిట్స్ రావడం, చర్మంపై మార్పులు రావడం, దాహం అధికం కావడం, శరీరం నీరసించడం, విసుగు వస్తాయి. కాబట్టి ఈ జాగ్రత్తలు తీసుకోవాలి.


● ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తెల్లటి నూలు దుస్తులు ధరించాలి.

● ఎండలో పనిచేసేవారు తలపాగా చుట్టుకుంటే మంచిది. టోపీలు శ్రేయస్కరం.

● నీరు, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ తరచూ తీసుకోవాలి. కొబ్బరినీళ్లు ఎంతో శ్రేయస్కరం.

● ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో విరివిగా లభించే ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఇళ్లలో సిద్ధంగా ఉంచుకోవడం ఉత్తమం. ఇంట్లో ఉష్ణోగ్రత తగ్గించుకోడానికి కిటికీలకు చాపలు కట్టి నీరు చల్లుకోవాలి. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే ఎండ తగిలే శరీర భాగాలకు సన్‌స్కిన్ లోషన్ రాసుకుంటే మేలు.

● వేసవి నుంచి రక్షణ పొందేందుకు మన రోజువారీ ఆహార అలవాట్లను కొంత మార్చుకుంటే మంచిది. దీనివలన వేసవి ఇబ్బందుల నుంచి చాలావరకు గట్టెక్కవచ్చు.



ఎక్కడపడితే అక్కడ లభించే నీటిని తాగరాదు. తాగితే అతిసారా ప్రబలే అవకాశం ఉంది.

● కాచి వడపోసిన నీటిని తాగడం ఉత్తమం. వేసవిలో ఎండకి వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. సాధ్యమైనంతవరకు ఎండలో తిరగరాదు. అత్యవసర పరిస్థితుల్లో ఎండ నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలి.

● ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి.

కలుషిత ఆహారంతో అతిసారా

కలుషితాహారం, నీరు తీసుకోవడం వల్ల అతిసారా వస్తుంది. శరీరంలో నీరు, ఇతర లవణాలు విరోచనాలు ద్వారా బయటకు పోవడంతో బాధితుడు నీరసించిపోతాడు. కాళ్లు, చేతులు చల్లబడడం, పెదవులు ఎండిపోవడం, కళ్లు పీల్చుకుపోవడం, వాంతులు, విరోచనాలు మొదలు కాగానే ఓఆర్ఎస్‌ను నీటిలో కలిపి తాగాలి. మజ్జిగ సేవిస్తే ఇంకా మేలు చేకూరుతుంది. లీటరు నీటిలో టీ స్పూన్ ఉప్పు, కొంత పరిమాణంలో చక్కెరను కలిపి తాగించడం శ్రేయస్కరం. ఇళ్ళలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను వాడకూడదు. నీటిని కాచి చల్లార్చి తాగాలి. చిన్నపిల్లలకు, వృద్ధులకు ఈ జబ్బులు వస్తే అత్యవసరంగా సమీపంలోని వైద్యశాలకు తరలించాలి.



- డాక్టర్ బాలాజీ, శ్వాసకోశ వైద్యనిపుణులు, జిల్లా ప్రభుత్వ వైద్యశాల, ఆత్మకూరు



తిరుమలాపురం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఫైబర్‌నెట్ యంత్రం

రూ.లక్షలు వ్యయం.. లక్ష్యానికి దూరం!

గ్రామాల్లో ప్రజలకు సాంకేతిక సేవలు చేరువ చేయాలనే ఉద్దేశంతో సచివాల యాల్లో యంత్రాలు ఏర్పాటు చేసి ఉద్యోగులను నియమించారు. కానీ లక్ష్యం మాత్రం నెరవేరలేదు. జిల్లాలో పలు సచివాల యాల్లో ఏర్పాటు చేసిన ఫైబర్‌నెట్ యంత్రాల నుంచి సిగ్నల్స్ రావడం లేదు. దీంతో ఉద్యోగులు అవసరమైనప్పుడు కంప్యూటర్లకు సెల్‌ఫోన్ హాట్‌స్పాట్ ద్వారా నెట్ అనుసంధానం చేసుకుని వినియోగిస్తున్నారు. సిగ్నల్స్ రాకపోవడంతో సొంత నిధులు వెచ్చించి ప్రజలకు సేవలందిస్తున్నామని పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 80 శాతం సచివాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

సోమశిలలో 54.086 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మార్చి25 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, మంగళవారం నాటికి 54.086 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 500, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

సమర్థవంత సముద్ర సంపదతోనే

బ్లూ ఎకానమీ అభివృద్ధి

వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు



మెరైన్ సిస్టమ్స్ పుస్తకావిష్కరణలో వీసీ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ తదితరులు

వెంకటాచలం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సముద్ర సంపదను సమర్థవంతంగా వినియోగించుకుంటే బ్లూ ఎకానమీ అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో మంగళవారం బ్లూ రేవో ల్యూషన్ ఇన్నోవేషన్స్ ఇన్ మెరైన్ సిస్టమ్స్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. సముద్ర పరిశ్రమ అభివృద్ధిలో పరిశోధన, సాంకేతికత, ఆవిష్కరణలు చాలా కీలకమన్నారు. సముద్ర ఆహార ఉత్పత్తుల నాణ్యతను మెరుగు పరిచేందుకు పరిశ్రమలు నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత మాట్లాడారు. సముద్ర పరిశోధన, మత్స్యపరిశ్రమ, బ్లూ ఎకానమీ అభివృద్ధిలో యూనివర్సిటీలు, పరిశోధన సంస్థలు, పరిశ్రమల మధ్య సమన్వయం అత్యవసరం అన్నారు. సదస్సుకు వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.విజయ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్.వెంకట్రాములు, మెరైన్ బయాలజీ విభాగాధిపతి డాక్టర్ హనుమా రెడ్డిలు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో మెరైన్ బయాలజీ నిపుణులు డాక్టర్ మానెల్ జెకరియా, చెన్నై డీప్ ఓషన్ మిషన్ సభ్యుడు డాక్టర్ ఎన్‌వీ వినీత్‌కుమార్, ఆక్వాకల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ హరిబాబు, హైటెక్ ఫార్మా సీఈవో ఎన్‌వీ రమణరెడ్డి పాల్గొన్నారు.

సహజ వ్యవసాయ పద్ధతులు పాటించాలి

● ఏపీసీఎన్‌ఎఫ్ డీపీడీ మాలకొండయ్య



మాట్లాడుతున్న మాలకొండయ్య

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రైతులు సహజ వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా మట్టి ఆరోగ్యంతోపాటు దిగుబడులు పెంచుకునే అవకాశం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ కమ్యునిటీ నేచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్‌ఎఫ్) జిల్లా ప్రాజెక్టు అధికారి మాలకొండయ్య పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, పాటించాల్సిన పద్ధతులు, మెలకువలపై నెల్లూరులోని ఓ హోటల్‌లో ఆయన ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాపు మంగళవారం ముగిసింది. చివరి రోజు ఆయన మాట్లాడుతూ నేలలో తేమను నిల్వచేసి, సూక్ష్మ జీవుల చురుకుదనాన్ని పెంచడం ద్వారా మంచి పంటల దిగుబడి పొందేలా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. భవిష్యత్తు లక్ష్యాలను నిర్ణయించడం, సమస్యలను ఎదుర్కోవడం, గ్రామ, మండల, జిల్లాస్థాయిలో లక్ష్యాలను సాధించేలా 2025-26 సంవత్సర కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ఈ ఏడాది 12.5 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించేలా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. 365 కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. 4 నుంచి 6 ప్రధాన పంటలతో పాటు 25 వైవిధ్య పంటలను సాగుచేసి నేల ఆరోగ్యాన్ని మెరుగు పరచడం, దిగుబడిని పెంచేందుకు ఏపీసీఎన్‌ఎఫ్ కృషి చేస్తోందని చెప్పారు.

భయపెడుతున్న భౌ..భౌ!



వామ్మో.. ఇదేంది ఇలా ఉంది!?



ఎన్ని శునకాలో!?

నగరవాసులను శునకాలు భయపెడుతున్నాయి. ఒంటరిగా వెళుతున్న వారిపై ముకుమ్మడిగా దాడికి తెగబడుతున్నాయి. బయటిప్రాంతాల నుంచి వస్తున్న కుక్కలు నగర శివార్లలోని కాలనీల్లో ఉండిపోతున్నాయి. అవే వస్తున్నాయా!? లేదా ఎవరైనా వదిలి వెళుతున్నారా!? అన్నది అంతుపట్టడం లేదు. కొత్త ప్రదేశంలో ఎటువెళ్లాలో తెలియక పాదచారులు, వాహనదారులను వెంటబడి కాటువేస్తున్నాయి. నగరపరిధిలో పట్టుకున్న కుక్కలను కార్పొరేషన్ సిబ్బంది పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కు.ని శస్త్రచికిత్స చేసి నగర వెలుపల వదిలేస్తున్నారు. కానీ కుక్కల సంఖ్య మాత్రం తగ్గనంటున్నాయి. వీటి నియంత్రణ కోసం కార్పొరేషన్ బడ్జెట్‌లో రూ.లక్షలు వెచ్చిస్తున్నా ఫలితాలు ఉండటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పట్టుకున్న కుక్కలకు కు.ని శస్త్రచికిత్సలు చేయించి, నగరానికి దూరంగా వదిలిపెట్టాలని నగరవాసులు కోరుతున్నారు.





ఇటీవల కుక్కల దాడిలో గాయపడిన ప్రజలు (ఫైల్)



ఇలాంటి దృశ్యాలు ఎన్నో.



- ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి)

కుష్ఠును ముందే గుర్తిస్తే నివారణ

● ప్రతినెల 11న పీహెచ్‌సీల్లో శిబిరాలు ● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠు వ్యాధిని ముందుగానే గుర్తించి వైద్య చికిత్సలు అందిస్తే అంగవైకల్యాన్ని అధిగమించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత వెల్లడించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలోని కుష్ఠు విభాగంలో మంగళవారం అధికారులతో ఆమె సమీక్ష జరిపారు. అంగవైకల్యం ఉన్న కుష్ఠు వ్యాధి బాధితులకు ఆ వైకల్యాన్ని తగ్గించేందుకు తగిన చికిత్సలు అందించాలని సూచించారు. కొత్తగా గుర్తించిన కేసులకు సంబంధించి వ్యాధిగ్రస్తుల వల్ల కుటుంబ సభ్యులకు, చుట్టు పక్కల వారికి వ్యాధి ప్రబలకుండా పెప్ చికిత్సలు చేయాలని ఆదేశించారు. జిల్లా కుష్ఠు వ్యాధి నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ ప్రతి నెల 11వ తేదీన కుష్ఠువ్యాధి వల్ల అంగ వైకల్యం కలిగిన వ్యక్తులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలన్నారు. అవసరమైన వారికి ఎంసీఆర్ చెప్పులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యూక్లియస్ వైద్యాధికారి డాక్టర్ సురేంద్ర బాబు, డాక్టర్ సునీత, ఫిజియోథెరపిస్ట్ నరసింహులు, డీపీఎంవోలు, డీఎఫ్‌ఐటీ ఏవో సతీష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

ఏపీఏహెచ్‌వోఎస్‌ఏ అధ్యక్షుడిగా కృష్ణమౌర్య

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పశుసంవర్థకశాఖ అధికారుల సేవా సంఘం(ఏపీఏహెచ్‌వోఎస్‌ఏ) జిల్లా అధ్యక్షుడిగా కోవూరు ఏడీ డాక్టర్ ఐ కృష్ణమౌర్య ఎన్నికయ్యారు. నెల్లూరులోని పశుసంవర్థకశాఖ జేడీ కార్యాలయంలో మంగళవారం ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీ మోహన్‌రావు పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా నెల్లూరు ఐఎస్‌డీపీ ఏడీ డీ మాధవీలత, కోశాధికారిగా నెల్లూరు ఏడీడీఎల్ ఏడీ జే చైతన్యకిషోర్, ఉపాధ్యక్షుడిగా నెల్లూరు వీపీసీ ఏడీ మాలకొండయ్య, సంయుక్త కార్యదర్శిగా కోట ఏడీ బీవీ సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. వీరిని నెల్లూరు జేడీ డాక్టర్ రమేష్‌నాయక్ సత్కరించి అభినందనలు తెలిపారు.



ఏపీఏహెచ్‌వోఎస్‌ఏ నూతన కమిటీ సభ్యులతో జేడీ రమేష్ నాయక్

'నవోదయ'కి 37 మంది విశ్వం విద్యార్థుల ఎంపిక



తిరుపతి(విద్య), మార్చి25 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి నిర్వహించిన ప్రవేశపరీక్షల్లో తిరుపతికి చెందిన విశ్వం విద్యాసంస్థల విద్యార్థులు 37మంది ఎంపికైనట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. విక్రమ్, గోపిక, జీవన్, సాయిరెడ్డి, శరత్‌చంద్ర, నవదీప్ యాదవ్, జాహ్నవి, జశ్వంత్, మిథున్, మిహాల్, నితీష్‌సాయి, సోహిని, అభ్యుదయ, సోహిత్‌తోపాటు మొత్తం 37మంది సీట్లు సాధించారన్నారు. 35 సంవత్సరాలుగా జాతీయస్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్స్ ప్రవేశపరీక్షల్లో తమ విద్యార్థులు విజయపరంపరని కొనసాగిస్తున్నారని చెప్పారు. ఉత్తమ ఫలితాలతో పాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులు సాధిస్తుండడం సంతోషంగా ఉందంటూ విద్యార్థులను అభినందించారు. ఎంపికైన వారికి కరస్పాండెంట్ ఎన్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందనలు తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా శ్రీనివాసులు



నెల్లూరు (హరనాథపురం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాలసాని శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన ఎస్సీ కార్పొరేషన్‌లో పూర్తి అదనపు బాధ్యతల ఈడీగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ పథకాలను లబ్ధిదారులకు సత్వరమే చేరవేసేందుకు కృషి చేస్తామన్నారు.

ఐసీడీఎస్ పీడీగా నిర్మలాదేవి



నెల్లూరు (హరనాథపురం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నిర్మలాదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పీడీగా పనిచేస్తున్న సుశీలదేవి అనారోగ్య కారణాలతో సెలవు పెట్టడంతో నిర్మలాదేవిని పూర్తి అదనపు బాధ్యతలతో పీడీగా నియమించారు. ఆమె ప్రస్తుతం బీసీ కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్నారు. ఐసీడీఎస్‌కు ఇన్‌చార్జ్ పీడీగానూ వ్యవహరించనున్నారు.

ఆదాయపు పన్ను సకాలంలో చెల్లించాలి

● అదనపు కమిషనర్ శ్రీధర్

నెల్లూరు (హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : ఆదాయపు పన్ను సకాలంలో చెల్లించాలని ఆదాయ పన్ను శాఖ అదనపు కమిషనర్ శ్రీధర్ ప్రజలను కోరారు. నెల్లూరులోని ఐఎంఏ హాల్‌లో ఆదాయపన్నుపై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ అడ్వాన్స్ టాక్స్, పన్ను చెల్లింపు విధానాన్ని వివరించారు. సకాలంలో పన్ను చెల్లించడం వల్ల కలిగే ప్రయోజనాలు, చెల్లించకపోతే ఆదాయపన్ను శాఖ తీసుకునే చర్యలను తెలియజేశారు. వివాద్ సే విశ్వాస్ పథకం గురించి ఆదాయపన్ను అధికారి సందీప్ కృష్ణ వివరించారు. అసిస్టెంట్ కమిషనర్ శరత్‌బాబు, వైద్యులు అశోక్, అమర్‌నాథ్, రాహుల్ పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో జీవిత ఖైదు

నెల్లూరు (లీగల్), (ఆంధ్రజ్యోతి) : బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో మేకల శ్రీనివాసులు అనే నిందితుడికి జీవిత ఖైదు, రూ. 24 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... ఉమ్మడి జిల్లా కోట మండలం గోవిందరాజుపల్లికి చెందిన మేకల శ్రీనివాసులు 2023 ఏప్రిల్ 18వ తేదీ స్థానిక పరవగుంట సమీపంలో పదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. కోట పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ చంద్రశేఖర్ వాదించారు.

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మునిసిపాలిటీ, కార్పొరేషన్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సాధారణ మెరిట్ సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో, నోటీస్‌బోర్డుల్లో అందుబాటులో ఉంచామన్నారు. అభ్యంతరాలను ఈనెల 28 లోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని, అభ్యంతరాన్ని స్పష్టంగా తెలియచేయాలని కోరారు. ఆధారాలు ఉంటే సంబంధిత అధికారి ధ్రువీకరణతో వాటిని సమర్పించాలన్నారు.

ఉగాది ఉత్సవాలకు గండికోటకు ఆహ్వానం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న చెన్నైలోని మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించినున్న ఉగాది ఉత్సవాలకు ఆహ్వానం అందినట్లు స్థానిక నగర పంచాయతీలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈయన అష్టావధానం, ఇష్టావధానం, పంచాంగ శ్రవణం పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొనున్నారు. ఈమేరకు సాహితీవేత్తలు, సహోపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8448
వెండి కిలో ధర	రూ. 100,500
వెండి ఒక గ్రాము	రూ.103.50

'కాకాణి'ని అరెస్ట్ చేస్తారా!?

- ఊకదంపుడు ప్రచారం
- నివాసం వద్ద మోహరించిన వైసీపీ శ్రేణులు
- అంబులెన్స్ సైరన్ మోగినా అలెర్ట్!

నెల్లూరు (క్రైం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసం వద్ద మంగళవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కోలాహలంగా మారింది. క్వార్ట్జ్ కేసులో కాకాణిని అరెస్ట్ చేస్తున్నారంటూ తెల్లవారుజాము నుంచే నాయకులు, కార్యకర్తలు జోరుగా ప్రచారం చేశారు. దానికితోడు నగరంలోని తన నివాసంలో ఇటు నాయకులు, కార్యకర్తలతోపాటు విలేకరులతోనూ కాకాణి సమావేశాలు ఏర్పాటు చేశారు. కేసులకు భయపడేది లేదని, జైళ్లకు భయపడేది లేదని చెప్పడంతో కాకాణిని అరెస్ట్ చేస్తున్నారని భావించిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన నివాసం వద్దకు చేరుకున్నారు. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు కాకాణి నివాసం వద్ద కొలాహలం నెలకొంది. పోలీసు వాహనం, అంబులెన్స్ సైరన్ వినిపిస్తే పోలీసులు వచ్చేశారంటూ అరుపులు, చుట్టుపక్కల కూర్చొన్న కార్యకర్తలు ఇంటి వద్దకు చేరుకోవడం పలుమార్లు జరిగింది. దీంతో స్థానికులు ఏం జరిగిపోతుంది అన్నట్లుగా ఆసక్తిగా చూస్తూ ఉండిపోయారు.

రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ కూడా: సీఎం

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి, ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డీ వెలగ జోషి సోమవారం రాత్రి సీఎంను కలవగా పైవిధంగా స్పందించారు. త్వరలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి యూనివర్సిటీల ఏర్పాటుపై సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ రెండు యూనివర్సిటీల ఉద్యోగుల జీతాల సమస్యను కూడా పరిష్కరిస్తామని చెప్పారు. వర్సిటీల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని, కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని సీఎం వారికి సూచించారు.

ఆర్టీఈ అడ్మిషన్లకు అనుమతి

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టంలో భాగంగా రాష్ట్రంలో ప్రైవేటు విద్యా సంస్థల్లో ఒకటో తరగతిలో అడ్మిషన్లు చేపట్టేందుకు అనుమతినిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై న్యాయ వివాదాలు ఏర్పడిన నేపథ్యంలో ఈ మేరకు స్పష్టతనిచ్చింది. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు విద్యా సంస్థలు 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలి. వారికి ఫీజులను ప్రభుత్వం చెల్లిస్తుంది.





అడ్డగోలుగా వాహనాల నిలుపుదల

పొదలకూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొందరు డ్రైవర్లు నడిరోడ్డుపై ఆటోలను అడ్డదిడ్డంగా నిలపు తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో రెండుచోట్ల ఆటోలకు స్టాండ్లు ఉన్నా ఎక్కడపడితే అక్కడ నిలుపుతుండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఆటోలకు తోడు కంకర లారీలు, టిప్పర్లు మెయిన్‌రోడ్డుపై తిరుగుతున్నా సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసు కోవడంలేదు. అలాగే కలువాయి, చేజర్ల, రాపూరు, సైదాపురం, పొదలకూరు మండలాల వాహనాలు పట్టణం మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్లే వాహనదారులు ఈ సమస్యతో వేళకు గమ్యానికి చేరుకోలేకపోతున్నారు. దీనికితోడు మెయిన్ రోడ్డుపై ఇష్టానుసారం ద్విచక్ర వాహనాలను మితిమీరిన వేగంతో నడుపుతుండటంతో వృద్ధులు, పిల్లలు బైక్‌ల వేగానికి బెంబేలెత్తుతున్నారు. ట్రిపుల్ రైడిం గ్ చేస్తూ కొందరు కేకలు వేస్తూ తిరుగుతున్నారు. మెయిన్‌రోడ్డు సి మెంటు రోడ్డు కావడంతో బైక్‌లు అదుపు తప్పే ప్రమాదం కూడా ఉంది. బస్టాండ్లలో రెండు బస్సులు ఎదురుపడితే సైడ్ తీసుకోలేకపోతున్నాయి.



పొదలకూరు మెయిన్‌లో రోడ్డు ట్రాఫిక్ దుస్థితి ఇలా..

- **ఇరువైపులా దుకాణాలు ముందుకు..**

దీనికితోడు పంచాయతీ బస్టాండ్‌లోని దుకాణాల యజమానులు ఇరువైపులా ముందుకు రావడంతో ఈ ట్రాఫిక్ సమస్యకు మరో కారణంగా చెప్పవచ్చు. ఈ విషయంపై పోలీసులు హెచ్చరించినా వారి తీరు మారడం లేదు. రోడ్డు రోజురోజుకు కుచించుకుపోతుండ టంతో సమస్య జఠిలంగా మారుతోంది. ఇప్పటి కైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు, పనుల కోసం వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు

విడవలూరు,మార్చి25 (ఆంధ్రజ్యోత):ముదివర్తి,ఊటుకూరు, అన్నారెడ్డిపాళెం, పెద్దపాళెంలో బుధవారం నుంచి 28 వరకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నగేష్‌కుమారి మంగళవారం ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ స్థలంలోని ఆక్రమణల తొలగింపు

మనుబోలు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కాగితాలపూరులోని ప్రభుత్వ స్థలం ఆక్రమణను మంగళవారం పోలీసుల సమక్షంలో కార్యదర్శి చెంచమ్మ తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సర్వే నెంబరు 90-4లో 5ఎకరాల 56సెంట్ల భూమిని గుర్తించి ఫిబ్రవరి 6న హద్దులు వేశామన్నారు. ఆ సమయంలో ఎవరూ నా భూమని రాలేదన్నారు. ఈనెలలో గ్రామానికి చెందిన మధురెడ్డి 0-75సెంట్లు ఆక్రమించి ఫెన్సింగ్ వేసినట్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎస్కవే టర్ సాయంతో ఆక్రమణలు తొలగించామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో సుకుమార్, విలేజ్ సర్వేయర్ శ్రీహరి ఉన్నారు.



ఎస్కవేటర్‌తో ఆక్రమణను తొలగింపజేస్తున్న అధికారులు

మద్యపాన దుష్పరిణామాలపై అవగాహనకు 'కేర్' అమలుకు కమిటీలు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మద్యపాన వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్'(కేర్) పేరుతో ఎక్సైజ్ శాఖ కొత్త కార్యక్రమాన్ని రూపొందించింది. దీనిపై మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. బహిరంగ సదస్సులు, ఫ్లాష్ మాబ్‌లు, ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, సెమినార్లు, సెషన్ల రూపంలో ప్రజల్లో అవగాహన కల్పించడం దీని ఉద్దేశం. ఈ కార్యక్రమం అమలుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు నియమించింది. రాష్ట్ర స్థాయి కమిటీకి ఎక్సైజ్ శాఖ మంత్రి చైర్మన్‌గా ఉంటారు. ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, అదనపు కమిషర్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, ఎన్‌జీవో నుంచి ఒకరు, మరో ఇద్దరు ప్రముఖ సామాజిక కార్యకర్తలు ఇందులో ఉంటారు. జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు.

హౌసింగ్ పీడీ.. పీఎంఏవై గృహాల సందర్శన

ఇందుకూరుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):కొత్తూరులోని పీఎంఏవై హౌసింగ్ కాలనీలో నిర్మాణం లో ఉన్న గృహాలను మంగళవారం హౌసింగ్ పీడీ టి.వేణుగోపాల్‌రావు, హౌసింగ్ ఏఈ డీవీ.సుబ్రహ్మ ణ్యం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు రూ.50వే లు, ఎస్టీలకు రూ.75వేలు మంజూరు చేస్తుందని లబ్ధిదారులకు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులు రెడ్డి, హౌసింగ్ అసిస్టెంట్ మల్లికార్జున, డీఈవో ప్రతాప్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ రఘు, హరీష్ పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ



సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

పొదలకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):మండల తహసీల్దారుగా బి.శివకృష్ణయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక రెవెన్యూ కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు సిబ్బంది ఘన స్వాగతం పలికి శాలువా, పూల మాలలతో సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నారాయణ, వీఆర్‌వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంపీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడిగా వేణుగోపాల్

నెల్లూరు (వైద్యం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(పీఎంపీ) జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నెల్లూరుకు చెందిన శాఖవరపు వేణుగోపాల్ నియమితులయ్యారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో పీఎంపీ జాతీయ అధ్యక్షుడు అగర్వాల్, ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్ కశ్యప్, కోశాధికారి సీఎస్ రావు జాతీయ సభ్యుడిగా వేణుగోపాల్‌ను ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆయన సంఘం జిల్లా అధ్యక్షుడిగా నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, సమాజసేవా కార్యక్రమాలను గుర్తించి జాతీయ కార్యవర్గంలోకి తీసుకున్నారు.

'మెడికవర్'లో అలోజెనిక్ బోన్‌మ్యారో మార్పిడి

నెల్లూరు (వైద్యం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మెడికవర్ కేన్సర్ ఇన్స్టిట్యూట్‌లో అత్యాధునిక అలోజెనిక్ బోన్‌మ్యారో మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని ఆసుపత్రి సీనియర్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ రంగరామన్ వెల్లడించారు. ఆసుపత్రిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహానగరాలకే పరిమితమైన అలోజెనిక్ బోన్‌మ్యారో శస్త్ర చికిత్సలు ఇప్పటి వరకు ఐదు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో ఐసీయూ వైద్య నిపుణుడు డాక్టర్ గౌతమ్, సెంటర్ హెడ్ ధీరజ్‌రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వంత్ రెడ్డి, పీఆర్వో చంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే పర్యవేక్షించడం అభినందనీయం

- రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులను స్థానిక ప్రజలే దగ్గరుండి పర్యవేక్షించుకోవడం అభినందనీయమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం 19వ డివిజన్ పరిధిలో జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన ఆకస్మి కంగా తనిఖీ చేశారు. కాగా, గిరిధర్‌రెడ్డి చేపట్టిన గడప గడప రెండో విడత కార్యక్రమం ఫైపాడు రోడ్డు సమీపాన ఉన్న కొత్తసంఘం వద్ద కొనసాగింది.

డివైడరెక్కిన కారు

నెల్లూరు రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు - ముత్తుకూరు రహదారిపై గుండ్లపాళెం వద్ద మంగళవారం రాత్రి ఓ కారు అదుపుతప్పి డివైడర్ ఎక్కింది. డ్రైవర్ పరారయ్యాడు. ఆ ప్రాంతంలో సూచికలు, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, మార్చి 25(ఆంధ్రజ్యోతి):ఇస్కపాలెం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరులోని జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన బాలసుబ్రహ్మణ్యం, సుమన్‌లు గాయపడ్డారు. వీరు పంట పాళెం ఫ్యాక్టరీలో పనిచేసి తిరిగి మోటర్‌బైక్‌పై నెల్లూరుకు వెళ్తుండగా ఇస్కపాళెం దాటిన తర్వాత వ చ్చే మలుపు బైక్ అదుపు తప్పి ప్రమాదం జరిగింది. స్థానికులు వీరిని గమనించి ఇస్కపాలెం పీహెచ్‌సీకి త రలించారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు.

రైతుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

మనుబోలు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా 12అంకెల యూనిక్ నంబర్ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జహీర్ తెలిపారు. ఈ విషయంపై మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ కోసం మరో అవకాశం ఇచ్చిందన్నారు. నెలాఖరులోగా వ్యవసాయ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

ఇందుకూరుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుడితిపాలెం పంచాయతీ కాకర్లదిబ్బలో నివాసమున్న తెలుగు దేశం కార్యకర్త తిరంశెట్టి సీనయ్య (40)గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్ఫూర్తితో ఏర్పాటు చేసిన 'అమ్మ చారిటబుల్ ట్రస్ట్' అధ్యక్షుడు కుడితిపాలెం పార్టీ యువ నాయకులు దొడ్ల మల్లికార్జున మృతుడి కుటుంబానికి రూ.5వేలు అంత్యక్రియల ఖర్చులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయి సన్నిధిలో పీఆర్ చీఫ్ ఇంజనీర్ దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని మంగళవారం పంచాయతీరాజ్ స్టేట్ చీఫ్ ఇంజనీర్ కే.శివకుమార్, శైలజదేవి దంపతులు దర్శించుకుని గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఆలయ పండితులు వారిని శేషవస్త్రాలతో సత్కరించి ఆశీర్వదించారు. అంతకుముందు ఆలయ అర్చకులు, సర్పంచు కందికట్టు పెంచలయ్య పీఆర్ ఏఈ గోపిరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వారి వెంట విశ్రాంత ఈఈ రమేష్ ఉన్నారు.

శ్రీజ్వాలాముఖి హుండీ లెక్కింపు

తోటపల్లిగూడూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వరిగొండ శ్రీజ్వాలాముఖి ఆలయహుండీ లెక్కింపును మంగళవారం చేపట్టారు. భక్తులు సమర్పించిన కానుకలు రూ.2.57లక్షలుగా ఉన్నట్లు ఆలయ కార్యని ర్వహణాధికారి తాత శ్రీనివాసరావు తెలిపారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, స్థానిక నేత కోడూరు శ్రీనివాసులురెడ్డి, రాజేశ్వరి దంపతుల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్య క్రమంలో స్థానిక నేత కోడూరు శ్రీనివాసులు రెడ్డి, రాజేశ్వరి, కర్పూరం శ్రీనివాస్ రెడ్డి, కాపులూరు మస్తాన్‌రెడ్డి, పోట్ల రఘురామయ్య పాల్గొన్నారు.

నేడు జొన్నవాడ ఆలయంలో..

బుచ్చిరెడ్డిపాలెం (ఆంధ్రజ్యోతి):జొన్నవాడ ఆలయ హుండీల లెక్కింపు బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవీ.శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ఉరేసుకుని వ్యక్తి మృతి

వెంకటాచలం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భార్యభర్తల మధ్య మనస్పర్థలతో అనికేపల్లికి చెందిన వెంకటసుబ్బయ్య (46) మంగళవారం ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందాడు. పోలీసుల కథరం మేరకు.. నాయీ బ్రాహ్మణుడు అయిన ఈయన కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై కుటుంబాన్ని సరిగా పట్టించుకోక పోవడంతో భార్యభర్తల మధ్య మనస్పర్థలు చోటుచేసుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

లాడ్జిలో ఒకరు....

నెల్లూరు(క్రైం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని సీపీఆర్ రెసిడెన్సీ లాడ్జిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని మూలాపేట అలంకార్ సెంటర్‌కు చెందిన చల్లా పెంచల కుమార్ వహాబ్‌పేటలోని సీపీఆర్ రెసిడెన్సీ లాడ్జిని నడుపుతున్నారు. ఈ నెల 19వ తేదీ చెన్నై నుంచి రోహన్ అనే వ్యక్తి లాడ్జికి వచ్చి ఆధార్ కార్డు నెంబరు చెప్పి రూమ్ అద్దెకు తీసుకున్నాడు. అప్పటి నుంచి అతను రూమ్‌లో ఉంటూ పెయింట్ పనులకు వెళ్లి వస్తుండేవాడు. సోమవారం సాయంత్రం రోహన్ ఆరోగ్యం బాగలేదని చెప్పి జయభారత్ వైద్యశాలకు వెళ్లి వచ్చాడు. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో రూమ్ నుంచి బయటకు వచ్చి తిరిగి రూమ్‌లోకి వెళ్లాడు. రూమ్‌బాయ్ ఉదయం 8 గంటల సమయంలో తలుపులు తట్టగా రోహన్ పలకలేదు. కిటికీలో నుంచి చూడగా రోహన్ బెడ్ ప్రక్కనే నేలపై పడి ఉన్నాడు. దీంతో అందరూ కలిసి తలుపును గట్టిగా నెట్టి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 సిబ్బంది రోహన్‌ను పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. దీంతో లాడ్జి యజమాని చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు...

బాత్రూమ్‌లో జారిపడి గాయపడ్డ వృద్ధుడు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని శెట్టిగుంటరోడ్డులో నివసించే కే కోటేశ్వరరావు(65) కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. సోమవారం ఆయన ఇంట్లో బాత్రూమ్‌లో జారిపడటంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. కోటేశ్వరరావు కుమారుడు శివ మంగళవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో లైన్‌మన్...

రాపూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న రేలంగి పాండు రంగయ్య మంగళవారం సాయంత్రం చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆయన బంధుమిత్రులు తెలిపారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామం చేజర్ల మండలం, కొలపనాయుడుపల్లిలో బుధవారం జరుగుతాయని వారు తెలిపారు. పాండురంగయ్య మృతి పట్ల సహోద్యోగులు, విద్యుత్ సిబ్బంది దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.



పాండురంగయ్య (ఫైల్)

సిమెంట్ లారీ బోల్తా : డ్రైవరుకి గాయాలు



బోల్తా పడిన సిమెంట్ లారీ

రాపూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండవోలు గ్రామ సమీపాన ఉన్న మలుపు వద్ద మంగళవారం వేకువ జామున సిమెంట్ లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవరుకి గాయాలయ్యాయి. ఆనంతపురం నుంచి గూడురుకు సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారించారు. అతివేగం, నిద్రలేమి కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా వారు నిర్ధారించారు.

పురుగు మందు దుకాణాలపై విజిలెన్స్ అధికారుల దాడులు

పొదలకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):తాటిపర్తిలోని వెంకటేశ్వర ఫర్టిలైజర్స్‌అండ్ ఫెర్టిసైడ్స్ దుకాణంపై మంగళవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, మండల వ్యవసాయాధికారితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో ఈ-పాస్ మిషన్, గోడౌన్ నిల్వలో తేడాలను గమనించి 344 బస్తాల ఎరువులను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఎరువుల విలువ రూ.2.93లక్షలని తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ ఏఓ వేణుగోపాల్ రావు, విజిలెన్స్ సీఐ నర సింహారావు, ఏసీటీవో విష్ణురావు, ఎంఏవో ఏ.వాసు తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు కృషి చేయాలి

- ఆర్పీఎఫ్ ఐజీ అరోమా సింగ్
- నెల్లూరు ఆర్పీఎఫ్ స్టేషన్ తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న ఐజీ ఆరోమా సింగ్ ఠాకూర్

నెల్లూరు(క్రైం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రైల్వే పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ నేరాల నియం త్రణకు కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే పోలీసు ఐజీ, ఆర్పీఎఫ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూరు ఆ దేశించారు. నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో ఉన్న ఆర్పీఎఫ్ పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఉద్యోగంలో మెల కువలపై అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. విధుల్లో నిర్ల క్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. స్టేషన్ ప్రాంగణం లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ విజయవాడ సీ నియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ వల్లేశ్వర బాపూజీ తోకల, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ జీ మధుసూదనరావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పీ రమేష్‌గౌడ్, ఎస్‌ఐ శివరూపావత్, ఏఎస్‌ఐలు కిరణ్‌కుమార్, రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

వేసవిలో దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు(క్రైం, ఆంధ్రజ్యోతి): వేసవిలో రైలు ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుంది, కావున దొంగతనాలు జరిగేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నందున జీఆర్‌పీఎస్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని రైల్వే డీఎస్పీ జీ మురళీధర్ ఆదేశించారు. నగరంలోని రైల్వే డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన నెలవారీ నేర సమీక్ష జరిపారు. స్టేషన్ ప్లాట్‌ఫాంలపై బీట్ల సంఖ్య పెంచి, దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రైళ్లలో కిటికీల పక్కన కూర్చొని ప్రయాణించే మహిళలకు దొంగతనాలపై అవగా హన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఎస్‌ఐ రమాదేవి, నెల్లూరు ఎస్‌ఐ హరిచందన, గూడూరు ఎస్‌ఐ చెన్నకేశవులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	111
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224

కోడిగుడ్ల ధర (100): 470



'కాళిదాసు'కు ఉగాది పురస్కారం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : చరిత్రకారుడు, సాహితీవేత్త, సర్వోదయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కాళిదాసు పురుషోత్తంకు ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఉగాది పురస్కారాన్ని అందజేసింది. సంఘం సభ్యులు మంగళవారం నగరంలోని పురషోత్తం నివాసానికి వెళ్లి పురస్కారాన్ని అందజేసి సత్కరిం చారు. కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, ఉపాధ్యక్షుడు టేకుమళ్ల వెంకటప్పయ్య, కార్యదర్శి అవ్వారు శ్రీధర్‌బాబు, బొగ్గవరపు రాధాకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెరుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'సర్వోదయ' మైదానంలో వాకర్స్‌కు సౌకర్యాలు కల్పించండి

● నగర కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సర్వోదయ కళాశాల మైదానంలో వాకర్స్‌కు సౌకర్యాలు కల్పించాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. నడిచేందుకు అనుకూ లంగా మైదానాన్ని తీర్చిదిద్దాలని, తాగునీరు అందుబా టులో ఉంచాలని సూచించారు. రోడ్లు, కూడళ్లు, డివైడ ర్లు, దుకాణాల వద్ద వ్యర్థాలు వేసే వారిని గుర్తించి జరిమానా విధించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు.

బంటు రీతి కొలువు...

● రసరమ్యంగా 'రాజు' బృందం కచేరీ
● నేటితో ముగియనున్న త్యాగరాజ స్మరణోత్సవాలు



కచేరీ చేస్తున్న యూపీరాజు, నాగమణిల బృందం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : బంటు రీతి కొలువు ఈయవయ్య రామా... అంటూ చెన్నైకు చెందిన యూపీ రాజు బృందం ఆలపించిన త్యాగరాజ కృతులు సంగీత ప్రియులను ఓలలాడించాయి. పురమందిరంలో జరుగుతున్న త్యాగరాజ స్మరణోత్సవాల్లో మంగళ వారం సాయంత్రం యూపీ రాజు, నాగమణి, జయవిఘ్నేశ్వర్, సుబ్రహ్మ ణ్యం రాజు బృందం గిటార్, గాత్ర కచేరీ రసరమ్యంగా సాగింది. ఉదయం వేల్పుల సరస్వతీ భాగవతారాణి సీతారాముల కల్యాణం, ఎం రాముడు భాగవతార్ పార్వతీ కల్యాణంపై హరికథా గానం చేశారు. స్థానిక కళాకారులు త్యాగయ్య కీర్తనలు ఆలపించి ఆకట్టుకున్నారు. సీతారామస్వామికి మహా విష్ణు అలంకారం, ప్రత్యేక పూజలు జరిగాయి. కాగా, స్మరణోత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి. చివరి రోజు ఉదయం, సాయంత్రం స్థానిక కళాకారుల గాత్ర కచేరీలు, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతాయి. రాత్రి సీతారాముల కల్యాణం, కమలాంబికా సమేత త్యాగరాజేశ్వర కల్యాణం, త్యాగరాజస్వామికి పుష్పాభిషేకం జరుగుతాయని నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమాలకు భక్తులందరూ తరలిరావాలని కోరారు.

వ్యాసాలు, కవితల పోటీ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : శ్రీవిశ్వావసు నామ ఉగాది సందర్భంగా సెయింట్ జోసఫ్ నర్సింగ్ స్కూలులో మంగళవారం వ్యాసాలు, కవితల పోటీలు జరిగాయి. నెహ్రూ యువత కేంద్రం కో ఆర్డినేటర్ ఏ మహేంద్రరెడ్డి అతిథిగా హాజరై విజేతలకు బహుమతి ప్రదా నం చేశారు. నెరసం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ ఆంథోనీ మేరీ, సింగంశెట్టి మురళి, సదడి అరుణ, నజ్మా, భారతి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ వీరంగం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే మల్లికార్జున అనే కానిస్టేబుల్‌కు మంగళవారం సెంట్రీ డ్యూటీ సమయంలో మద్యం మత్తులో సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డితో వాదించారు. పలువురు కానిస్టేబల్స్ వచ్చి సర్దుబాటు చేయడంతో సమస్య సద్దుమణిగింది.

శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము

నరసింహులుకొండ గ్రామము, నెల్లూరు రూరల్ మండలం, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

ఇందుమూలముగా యావన్మందికి తెలియపరచుట ఏమనగా, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు రూరల్ మండలం నరసింహ కొండపై వెలసియున్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానమునకు చెందిన దిగువ కనపరచిన బీజు హక్కులు (01-04-2025 నుండి 31-03-2026 వరకు) పొందుటకు ఈ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డు టెండరు, బహిరంగ వేలం (5వ సారి) తేది 29-03-2025 శనివారం నాడు ఉదయం 11.00 గంటలకు మరియు బ్రహ్మోత్సవాలు సందర్భంగా దిగువ కనపరచిన బీజు హక్కులు (06-05-2025 నుండి 16-05-2025 వరకు) పొందుటకు తేది 02-04-2025 సోమవారం నాడు ఉదయం 11.00 గంటలకు సీల్డు టెండరు/సీల్డు కొటేషన్ నిర్వహించబడును. పాల్గొనదలచిన వారు దిగువ దిగువ కనపరచిన విధముగా ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చను. పై దేవస్థానంనకు సంబంధించిన ఫిక్స్‌డ్ డిపాజిట్స్ మీద అత్యధిక వడ్డీ రేటు కొరకు బ్యాంకర్లు నుండి ఈ - టెండరు కోరబడుచున్నవి. ఈ టెండరు వివరముల కొరకు www.apeprocurement.gov.in లో ENDOWMENTS DEPARTMENT నందు చూడగలరు. 1) టెండరు డౌన్ లోడింగ్ తేది: 25-03-2025 ఉ. 10.00 గం.ల నుండి 2) టెండరు ముగింపు 28-03-2025 సా. 5.00 వరకు 3) టెండరు ఖరారు తేది : 29-03-2025 ఉ. 11.00 లకు

ఈ-ప్రొక్యూర్‌మెంట్ / సీల్డు టెండరు / బహిరంగ వేలం (5వ సారి)

వ.నెం.	హక్కుల - సమయం	ప్రథమ ధరావత్తు	రిమార్కులు
1.	తలనీలాలు- సేకరించుకొను హక్కు	రూ. 3,00,000/-	ఈ-ప్రొక్యూర్మెంట్/ సీల్డు టెండరు/బహిరంగ వేలము
2.	ఫిక్స్ డిపాజిట్ మీద అత్యధిక వడ్డీ రేటు కొరకు		ఈ-ప్రొక్యూర్మెంట్
3.	చెప్పుల స్టాండ్	రూ. 5.000/-	సీల్డు టెండరు /బహిరంగ వేలము
4.	కొబ్బరి సామాన్లు, ఫ్లంబింగ్ సామాన్లు సరఫరా చేయుట	రూ. 5.000/-	సీల్డు టెండరు
5.	భక్తులు సమర్పించిన ముతక బియ్యం విక్రయించుకొను హక్కు	రూ. 2.000/-	సీల్డు టెండరు

సీల్డు టెండరు / సీల్డ్ కొటేషన్

వ. నెం.	టెండరు వివరములు	ప్రథమ ధరావత్తు రూ.	లైసెన్సు కాలపరిమితి & సమయం
1	ఎలక్ట్రికల్ డెకరేషన్ చేయుటకు	10,000/-	06.05.2025 నుండి 16.05.2025 వరకు జరుగు బ్రహ్మోత్సవములకు వివిధ ఐటంలకు తేది: 02-04-2025న దేవస్థానము వద్ద ఉ.10.00 గం.లోగా సీల్డుటెండర్లు/సీల్డు కొటేషన్స్ దాఖలు పరచుకొనగలరు
2.	పందిర్లకు సవక కర్రలు, తాటాకు సప్లై చేయుటకు	2000/-	
3.	తెల్ల సున్నం వేయుటకు	2000/-	
4.	దేవస్థానమునకు రంగులు వేయుటకు	2000/-	
5.	రథము రిపేర్లు మరియు పెయింట్స్ వేయుటకు	2000/-	
6.	వాహనం రిపేర్లు మరియు పెయింట్స్ వేయుటకు	2000/-	
7.	జనరేటర్ మరియు మైక్‌సెట్టు ఏర్పాటు చేయుటకు	2000/-	
8.	షైర్స్ సప్లై చేయుటకు	2000/-	
9.	క్యాంటీన్‌లో టిఫిన్ & భోజనములు ఏర్పాటు చేయుటకు	2000/-	
10.	బ్రహ్మోత్సవాలలో ఫోటోలు, వీడియోగ్రాఫ్	2000/-	
11.	ట్యాంకర్లతో కొండపైకి నీరు సప్లై చేయుటకు	2000/-	
12.	జంగిల్ క్లియరెన్స్ & మట్టి తోలుటకు	2000/-	

ఇతర షరతులు వివరములకు, కార్యాలయం పనిచేయు వేళలయందు కాని, బహిరంగ వేలంపాట సమయము నందు కాని తెలుసుకొనవచ్చును.

స్థలం : నరసింహకొండ
తేది : 24-03-2025


కార్యనిర్వహణాధికారి
సెల్ : 9494289008

చంద్రన్న హయాం.. సర్వేపల్లి అభివృద్ధి పథం



రూ.52.87 కోట్లతో శరవేగంగా అభివృద్ధి పనులు

అభివృద్ధికి మారుపేరు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



పూడికతీసివేత తర్వాత సాగునీటి కాలువ

వెంకటాచలం : కూటమి ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల అనతీకాలంలోనే సర్వేపల్లి నియోజకవర్గం వ్యాప్తంగా రూ.52.87 కోట్లతో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. ముఖ్యంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, గోకులాలు, ఎన్ఆర్ఈజీఎస్ పనులు, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ రోడ్ల మరమ్మత్తు పనులు ఇలా చెప్పుకుంటూపోతే అభివృద్ధి బాటలో సర్వేపల్లి నియోజకవర్గాన్ని ప్రథమస్థానంలో నిలిపారు. సర్వేపల్లి అభివృద్ధి కి సరికొత్త నిర్వచనంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నిలిచారు. సర్వేపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా రూ.12.83 కోట్లతో సీసీ రోడ్లలను నిర్మించి ప్రారంభించారు. పాడి పరిశ్రమ బలోపేతమే లక్ష్యంగా రూ.4.43 కోట్లతో ప్రతి గ్రామంలో గోకులాలను నిర్మించారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.22.04 కోట్లతో ప్రజలకు మెచ్చిన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సర్వేపల్లి అంతాట అస్తవ్యస్తంగా ఉన్న సాగునీటి కాలువల కు కూటమి ప్రభుత్వంలో మోక్షం కలిగింది. రూ.10.77 కోట్లతో ఇరిగేషన్ పనులకు శ్రీకా రం చుట్టి పూర్తి చేశారు. గుంతలు లేని రహదా రులే లక్ష్యంగా సర్వేపల్లి నియోజకవర్గంలో రూ.2.79 కోట్లతో ఆర్ అండ్ బీ రోడ్లకు మహర్దశ పెట్టింది. ఇవే కాదు ఇలా చెప్పుకుంటూ పోతే సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అడుగులు ముందుకు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో సర్వేపల్లి నియోజక వర్గం అభివృద్ధి పుంతలు తొక్కింది.

మనుబోలు మండలం కొలనుకుదురు చెరువు అభివృద్ధిలో భాగంగా శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి



ముత్తుకూరు : కూట మి ప్రభుత్వం ఏర్పా టయ్యాక గ్రామాలలో మౌలిక వసతుల అభివృ ద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. సర్వేపల్లి శాసన సభ్యులుగా సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి ఎంపికయ్యాక గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టారు. ప్రభుత్వం మంజూ రు చేసిన పథకాలను నియోజకవర్గంలో అమలు చేసేందుకు కృషి చేశారు. నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో అన్నీ కాలనీలకు సిమెంటు రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించారు. గ్రామాల్లో ప్రస్తుతం అన్నీ కాలనీ సిమెంటు రోడ్లతో కళకళలాడుతున్నాయి. రైతులకు అవసరమైన సాగునీటిని అందించేందుకు ప్రత్యేక కృషి చేశారు. నియోజకవర్గంలోని ప్రధాన పంట కాలువలను మరమ్మతులు చేయించి సాగునీటిని అందించేందుకు ప్రత్యేక కృషి చేశారు. నియోజకవర్గంలోని ప్రధాన పంట కాలువలు గుర్రపుడెక్కలతో నిండిపోయి సాగునీటి ప్రవాహానికి అనువుగా లేని పరిస్థితిల్లో రైతుల భాగ స్వామ్యంలో కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం నియోజక వర్గంలోని ప్రధాన పంట కాలు వలు సాగునీటితో కళకళలాడుతూ, పంట సాగు చేసేందుకు అవసరమైన సాగునీటిని అందిస్తున్నాయి.

గ్రామాలు మౌలిక వసతులతో కళ కళ!!

గ్రామాలలో తాగునీరు అందించేందుకు అన్నీ విధాల చర్యలు తీసుకోవాలని అధికారులకు తగిన సూచనలు ఇస్తూ అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయించారు. అభివృద్ధి కార్యక్రమాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సంక్షేమానికి అవసరమైన అన్నీ పనులు పూర్తి చేయించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోఆవలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా నియోజకవర్గంలోని గిరిజనుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తూ వారికి ఆధార్, రేషన్ కార్డులను ఇప్పించి ప్రభుత్వ పథకాలు వారి ఇళ్లకు చేరేలా చర్యలు తీసుకున్నారు.



సర్వేపల్లి రిజర్వాయర్‌లో చేప పిల్లలను విడిచిపెడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరులో డయాలసిస్ సెంటర్

సర్వేపల్లి నియోజకవర్గంలోని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వసతుల కల్పనపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆరు మండలాలకు కూడలి అయినా పొదలకూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయించారు. ఇప్పటికీ అధికారికంగా ప్రారంభం కాకపోయిన డయాలసిస్ సేవలు మాత్రం అందిస్తున్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలోనూ సీఎస్ఆర్ నిధులతో అవసరమైన అన్ని పరికరాలను అందుబాటు లోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ముత్తుకూరు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చే సన్నాహాల్లో ఉన్నారు.

● **గిరిజనుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి**

సోమిరెడ్డికి మొదటి నుంచి గిరిజనులంటే ప్రత్యేక అభిమానం. సమాజంలో అత్యంత అమాయకులు, నిరక్షరాస్యులైన గిరిజనుల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు ఆయన నిరంతం తపిస్తుంటారు. అందులో భాగంగా గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం వెంకటాచలంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారం కోసం ఇటీవల జిల్లా అధికారులతో పలుమార్లు సమీ క్షలు నిర్వహించడంతోపాటు అసెంబ్లీలోనూ ప్రత్యేకంగా ప్రస్తావించారు. గిరిజనుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతామని మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో హామీ ఇచ్చా రు. మరోవైపు సర్వేపల్లి నియోజకవర్గంలో వందలాది మంది గిరిజనులకు ఆధార్ కార్డు లు లేకపోవడం కూడా సోమిరెడ్డి దృష్టికి వచ్చింది. గిరిజనులు ఎక్కువగా నివసించే తోటపల్లిగూడూరు మండలం మల్లికార్జునపురం పంచాయతీలోపాటు ముత్తుకూరు మండలం పైనాపురం పంచాయతీలోని చిన్న సంఘాన్ని దత్తత తీసుకున్నారు.

● **అసెంబ్లీలో సర్వేపల్లి గళం**

సర్వేపల్లి నుంచి మూడోసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టిన సోమిరెడ్డి నియోజకవర్గ వాణిని బలంగా వినిపిస్తున్నారు. గిరిజనుల సమస్యలతోపాటు కృష్ణపట్నం పోర్టులో టెర్మినల్ పునరుద్ధరణ, రిలయన్స్ భూముల్లో పరిశ్రమల ఏర్పాటు, ధాన్యానికి కనీస మద్దతు ధర, విద్యుత్ పరికరాల కొరత, ఇరిగేషన్ భూముల ఆక్రమణ, కోడూరు బీచ్ అభివృద్ధి, పేదలకు ఇళ్ల తదితర అంశాలతోపాటు వైసీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన అక్రమాలు, అరాచకాలను అసెంబ్లీ వేదికగా ప్రస్తావించారు.

● **131 మందికి రూ.1.60 కోట్ల సాయం**

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు సోమిరెడ్డి ఆర్థిక సాయం అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 131 మందికి రూ.1.60 కోట్లు ఆర్థిక సాయం మంజూరైంది.

రాష్ట్ర ప్రభుత్వం శాస్త్ర సాంకేతిక రంగాల్లో నూతన ఆలోచనలను, ఆవిష్కరణలను ప్రోత్సహించే దిశగా అడుగులేస్తోంది. అందులో భాగంగా జిల్లాలో ఏపీ రతన్ టాటా ఇన్నోవేటివ్ సెంటర్ నెలలోపే ప్రారంభం కానుంది. ఏపీఐఐసీకి చెందిన భవనంలో తాత్కాలికంగా ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



నూతన ఆలోచనలు..

ఆవిష్కరణలకు ప్రోత్సాహం

- నెలలోపు రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభమయ్యే అవకాశం
- తాత్కాలికంగా ఏపీఐఐసీ భవనంలో ఏర్పాటు
- రూ.50 కోట్లు కేటాయించనున్న ప్రభుత్వం

ప్రపంచీకరణకు తోడు శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎప్పటికప్పుడు వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో విద్యార్థుల్లోనూ, యువతరంలోనూ నూతన ఆలోచనలను, నవ్య ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు అవసరమైన శాస్త్ర సాంకేతిక, ఆర్థిక తోడ్పాటును అందించడానికి సీఎం చంద్రబాబు ప్రాధాన్యమిస్తున్నారు. ఆ క్రమంలో రతన్ టాటా స్ఫూర్తితో ఆయన పేరిట ఏపీ రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అమరావతి కేంద్రంగా పనిచేసే ఈ హబ్‌కు అనుబంధంగా విశాఖ, రాజమహేంద్రవరం, ప్రకాశం, అనంతపురం, తిరుపతి జిల్లాలలో ఇన్నోవేటివ్ సెంటర్లు ఏర్పాటు చేస్తోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ప్రాతిపదికన ఏర్పాటయ్యే ఈ సెంటర్ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.50 కోట్లు కేటాయించనుంది. ఆపై ఏటా రూ.30 కోట్లు కేటాయిస్తుంది. టాటా ట్రస్టు నిర్వహించే ఈ సెంటర్‌కు ఓఎన్‌జీసీ, కియా, ఎల్ అండ్ టీ, ఎల్జీ, దివీస్, డాక్టర్ రెడ్డీస్, అమరరాజా తదితర పది ప్రతిష్ఠాత్మక సంస్థలు భాగస్వాములుగా వ్యవహరించనున్నాయి. ప్రభుత్వం, టాటా ట్రస్టులతో పాటు ఈ సంస్థలు సైతం సెంటర్ నిర్వహణకు మ్యాచింగ్ గ్రాంట్ కింద నిధులు ఇవ్వనున్నాయి. స్టార్టప్‌లను పెంచడమే ఈ సెంటర్ ఏర్పాటు ఉద్దేశం. దానికనుగుణంగా విద్యార్థులను, పెట్టుబడిదారులను, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఒకచోట చేర్చి స్టార్టప్‌లను విజయవంతం చేయడానికి ఈ సెంటర్ అవసరమైన అన్ని చర్యలకూ సహకరిస్తుంది.

ఎయిర్‌పోర్టు వద్ద తాత్కాలిక భవనంలో..

జిల్లాకు సంబంధించి ఇన్నోవేటివ్ సెంటర్ కోసం ప్రస్తుతానికి తాత్కాలిక భవనాలను గుర్తించారు. రేణిగుంట విమానాశ్రయం సమీపంలో ఏపీఐఐసీకి సంబంధించిన నిరుపయోగ భవనాలను కలెక్టర్ ఎంపిక చేశారు. గతంలో ఆ భవనాలలో ఏపీఐఐసీ జోనల్ కార్యాలయం నడిచేది. కార్యాలయాలన్నీ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌లోనే ఉండాలని కలెక్టర్ ఆదేశించడంతో ఇటీవలే ఆ కార్యాలయాన్ని కలెక్టరేట్‌కు తరలించారు. దీంతో ఖాళీగా ఉన్న ఆ భవనాల్లో తాత్కాలికంగా ఇన్నోవేటివ్ సెంటర్ ప్రారంభించాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. దీనిపై ఇటీవల ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి కాటమనేని భాస్కర్ జిల్లా అధికారులతో చర్చించారు. ఈ భవనాల్లో ఇన్నోవేటివ్ సెంటర్ నెలలోపే ప్రారంభించేందుకు జిల్లా అధికార యంత్రాంగం వేగంగా చర్యలు తీసుకుంటోంది.

శాశ్వత భవనాలకు రెండు చోట్ల భూముల గుర్తింపు

రతన్ టాటా ఇన్నోవేటివ్ సెంటర్‌కు శాశ్వత భవనాలు నిర్మించడం కోసం ఐదెకరాల అనువైన భూముల కోసం జిల్లా యంత్రాంగం అన్వేషిస్తోంది. అత్యాధునిక శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన కీలక కేంద్రం కావడంతో దీన్ని జాతీయ రహదారి పక్కనే నిర్మించాలని కలెక్టర్ భావిస్తున్నారు. అందులో భాగంగా పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారికి పక్కన ఉండేలా తిరుపతి రూరల్ మండలం దామినీడు వద్ద, అలాగే రేణిగుంట వద్ద భూములు గుర్తించారు. వీటిని ఐటీ శాఖ ఉన్నతాధికారులు వచ్చి పరిశీలించి ఒకదాన్ని ఖరారు చేయనున్నారు.

ఖనిజ సంపద కోసం అడ్డ'దారి'

- రోడ్డు పేరుతో ప్రభుత్వ భూమి కబ్జాయత్నం?
- చక్రం తిప్పుతోన్న తమిళ సిలికా వ్యాపారి



సిలికామైన్‌కు రోడ్డు పేరుతో కొట్టేసేందుకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వ భూమి

కోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయల విలువచేసే ఖనిజ సంపదను తరలించేందుకు ఓ తమిళ వ్యాపారి అడ్డ'దారులు' తొక్కుతున్నాడు. అయిదెకరాల ప్రభుత్వ భూమిని కబ్జాచేసి దారి నిర్మించేందుకు పన్నాగం పన్నాడు. వివరాలివి.. కోట మండలం కర్లపూడిలోని సిలికా మైన్లలో తమిళనాడుకు చెందిన ఓ వ్యాపారికి 8.24 ఎకరాల లీజు పొందారు. వైసీపీ నాయకుల సిండికేట్‌లోని ఈ మైన్ ఇటీవలే ఈ యజమానికి దక్కినట్లు సమాచారం. అయితే ఆ మైన్ నుంచి టిప్పర్లు, లారీలు వెళ్లేందుకు మార్గంలేదు. ఇక్కడ సిలికాను తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలకు తరలించాలంటే దారి తప్పనిసరి. దీంతో ఆ తమిళవ్యాపారి తన మైన్‌పక్కన సర్వే నెంబరు 107లో 120 ఎకరాల ప్రభుత్వ దిబ్బ పొరంబోకు భూముల్లోని 5 నుంచి 7 ఎకరాల్లో దారి వేసుకోవాలని భావిస్తున్నాడు. ఇందుకు ఆ వ్యాపారి పలురకాల ప్రయత్నాలు చేస్తున్నాడు. రోడ్డు వేసుకొని పక్కనే ఉన్న ప్రభుత్వ భూముల్లోని సిలికాను కూడా చేజిక్కించుకోవాలనేది సదరు వ్యాపారి పన్నాగం. ఈవిషయంలో స్థానికులను మభ్యపెట్టినట్లు తెలిసింది. రోడ్డు వేయాలనుకుంటున్న ప్రభుత్వ భూమి విలువ ప్రస్తుత లెక్కల ప్రకారం కోట్ల రూపాయల్లోనే ఉంటుంది. రోడ్డు నిర్మాణానికి సహకరిస్తే గ్రామానికి రూ.50 లక్షలు, రాజకీయ నాయకులకు కొంతమొత్తం ముట్టజెప్పేందుకు కొందరు మధ్యవర్తులు ఒప్పందం కుదిర్చినట్లు సమాచారం. అధికారపార్టీ నాయకుల దృష్టికి కూడా ఈ వ్యవహారం వెళ్లినట్లు భోగట్టా.

ఆ భూములపై నిఘా పెంచాం

కర్లపూడిలోని సర్వే నెంబరు 107లోని ప్రభుత్వ భూములపై నిఘా పెంచాం. తమిళ వ్యాపారి రోడ్డు పేరుతో చేసిన ప్రయత్నాలు వాస్తవమే. ఆ ప్రయత్నాలను అడ్డుకున్నాం. ప్రభుత్వ సిలికా భూముల్లోకి అడుగుపెడితే కేసులు పెడతాం.

- జయజయరావు, తహసీల్దారు

ఎస్వీయూ, పద్మావతి వర్సిటీల్లో అమెరికన్ కాన్సులేట్ జనరల్ ప్రతినిధి

- అధికారులతో సమావేశమైన ఎమీలియా బి.స్మిత్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులోని అమెరికన్ కాన్సులేట్ జనరల్‌కు చెందిన పబ్లిక్ డిప్లొమసీ ఆఫీసర్ ఎమీలియా బి. స్మిత్ ఎస్వీయూనివర్సిటీ, పద్మావతి మహిళా యూనివర్సిటీల్లో సోమవారం పర్యటించారు. ఆయా యూనివర్సిటీ అధికారులతో సమావేశమయ్యారు. యూనివర్సిటీలకు అమెరికన్ సంస్థల నుంచీ బోధన, పరిశోధన రంగాల్లో తమ వంతు సహకారానికి కృషి చేస్తానన్నారు. విద్యార్థులు, ఉద్యోగుల పరస్పర మార్పిడికి కూడా ఉన్న అవకాశాలను పరిశీలిస్తామన్నారు. యూనివర్సిటీ ప్రగతి, విద్యార్థులు, ఉద్యోగుల సామర్థ్యాలపై ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని వివరించారు. ఈ సందర్భంగా ఎమీలియ బి.స్మిత్‌ను అధికారులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్వీయూలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఇరు సంస్థల ప్రతినిధులు

కీచక గురువు సస్పెన్షన్

తిరుపతి(విద్య)/చిల్లకూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన కీచక గురువు సస్పెండయ్యారు. డీఈవో కేవీఎన్ కుమార్, డిప్యూటీ ఈవో సనత్‌కుమార్ తెలిపిన ప్రకారం.. చిల్లకూరు మండలం తిక్కవరం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మధుబాబు ఓ విద్యార్థినిపట్ల అసభ్యంగా వ్యవహరించారు. దీనిపై విచారణకు గూడూరు ఉప విద్యాశాఖాధికారిని డీఈవో ఆదేశించారు. ప్రాథమిక విచారణ నివేదిక ఆధారంగా మధుబాబును సస్పెండ్ చేస్తున్నట్టు డీఈవో వెల్లడించారు.

మోడల్‌స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), మార్చి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేవీబీపురం, యర్రావారిపాళెం, వెంకటగిరి, తడ, మావిళ్లపాడు మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీటిలో 6వ తరగతిలో చేరేందుకు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. వీరికి ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశం ఉంటుందదన్నారు. 'ఇంటర్‌లో చేరేందుకు మే 2లోగా దరఖాస్తు చేసుకోవాలి. వీరికి 10వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఇంటర్‌లో ప్రవేశం కల్పిస్తారు. విద్యార్థులు apms.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు' అని పేర్కొన్నారు.

జిల్లా స్థూల ఉత్పత్తి లక్ష్యం రూ.1.08 లక్షల కోట్లు

- తలసరి ఆదాయ లక్ష్యం రూ.4.08 లక్షలు
- ఈ ఏడాది అంచనా రూ.3.45 లక్షలు
- కలెక్టర్ల కాన్ఫరెన్సులో వెల్లడైన వివరాలు

వచ్చే నెల ఒకటి నుంచి మొదలయ్యే కొత్త ఆర్థిక సంవత్సరంలో జిల్లా స్థూల ఉత్పత్తి రూ.1.08 లక్షల కోట్లు సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. తలసరి ఆదాయాన్ని రూ.4.08 లక్షలుగా లక్ష్యం ప్రకటించింది. ఇక, జిల్లా స్థూల ఉత్పత్తి విషయంలో మూడేళ్ల కిందట రెండో స్థానంలో ఉన్న జిల్లా క్రమేపీ మూడో స్థానానికి దిగజారింది. అలాగే తలసరి ఆదాయంపరంగానూ మూడు నుంచి నాలుగో స్థానానికి దిగజారింది. అమరావతిలో మంగళవారం ప్రారంభమైన కలెక్టర్ల కాన్ఫరెన్సు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో జిల్లాకు సంబంధించిన పలు అంశాలు, గణాంకాలు వెల్లడయ్యాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



సదస్సులో పాల్గొన్న ఎస్పీ హర్షవర్ధనరాజు, కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,08,651 కోట్లు జిల్లా స్థూల ఉత్పత్తి సాధించాలని లక్ష్యం ప్రకటించింది. ప్రభుత్వ గణాంకాలను చూస్తే.. 2022-23లో జిల్లా స్థూల ఉత్పత్తి రూ.76,500 కోట్లు ఉండగా, 2023-24లో రూ.81,619 కోట్లకు చేరింది. ఈ నెలాఖరుతో ముగుస్తున్న 2024-25లో రూ.91,478 కోట్లుగా అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.17,173 కోట్ల వరకు స్థూల ఉత్పత్తి పెంచాలని నిర్దేశించింది.

- ఇక, రాష్ట్ర జీడీపీకి జిల్లా నుంచీ 2022-23లో 5.84 శాతం, 2023-24లో 5.74 శాతం వాటా అందింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇక నెలాఖరుతో ముగుస్తున్న 2024-25లో 5.74 శాతం వాటా చేరింది. ఈ క్రమంలో కొత్త ఆర్థిక సంవత్సరంలో 5.82 శాతంగా టార్గెట్ విధించింది.
- 2022-23లో జిల్లా స్థూల ఉత్పత్తిలో ఏపీలో విశాఖ తర్వాత తిరుపతి జిల్లా రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్ర జీడీపీకి వాటా విషయంలోనూ రెండో స్థానంలో ఉండింది. రాయలసీమ పరంగా మొదటి స్థానం దక్కించుకుంది. 2023-24లో విశాఖ, ఎన్టీయార్ జిల్లాల తర్వాత తిరుపతి మూడో స్థానానికి దిగజారింది. రాష్ట్ర జీడీపీకి వాటా అందించడంలోనూ మూడో స్థానమే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ మూడో స్థానంతోనే సరిపెట్టుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం లక్ష్యాల్లోనూ విశాఖ, ఎన్టీఆర్ జిల్లాల తర్వాత తిరుపతి మూడో స్థానంలో ఉంది.

ప్రజలను భాగస్వాములు చేయండి

- తిరుపతి పోలీస్ పనితీరు బాగుందంటూ సీఎం కితాబు

పోలీసు శాఖలో ప్రజల భాగస్వామ్యం చాలా ముఖ్యం. ఈ విషయంలో తిరుపతి ఎస్పీ చేపట్టిన చర్యలు బాగున్నాయి' అంటూ సీఎం చంద్రబాబు కొనియాడారు. అమరావతిలో మంగళవారం సీఎం అధ్యక్షతన జరిగిన సదస్సులో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పాల్గొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ, విజుబుల్ పోలీసింగ్ విషయంలో తిరుపతి పోలీసులు బాగా పనిచేస్తున్నారంటూ సీఎం చంద్రబాబు కితాబిచ్చారు. 'సైబర్ నేరాల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించి పెరగకుండా చూడాలి. ప్రతి రోజూ ఒక గ్రామం ఎంచుకుని పోలీసులు పల్లె నిద్ర చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు కాకుండా పోలీసులంటే ప్రజల్లో నమ్మకభావం కల్పించాలి. అత్యాచారాలు, గంజాయి కట్టడికి ఉక్కుపాదం మోపాలి. శాంతి భద్రతల విషయంలో రాజీ పడొద్దు' అని ఎస్పీలకు దిశానిర్దేశం చేశారు.

- తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

తలసరి ఆదాయంలో నాలుగో స్థానం

2022-23లో రూ.2,89,919తో విశాఖ, కృష్ణా జిల్లాల తర్వాత తిరుపతి జిల్లా నిలిచింది. 2023-24లో రూ. 3,08,176లతో విశాఖ, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల తర్వాత నాలుగో స్థానానికి చేరింది. 2024-25లో రూ.3,44,989 తలసరి ఆదాయం అంచనాల మేరకు నాలుగో స్థానంలోనే కొనసాగుతోంది. 2025-26లో రూ.4,08,702 ఉండేలా ప్రభుత్వం లక్ష్యం విధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 18.47 శాతం పెంపుతో.. రూ.63,712 పెంచాలి.

ఆధార్ పెండింగ్ 0.02 శాతమే

జిల్లాలో ఈనెల 22వ తేదీ నాటికి కేవలం 40 మందికి మాత్రమే ఆధార్ కార్డులు (0.02 శాతం) జారీ చేయాల్సి ఉంది. అదే సమయంలో 3009 మంది చిన్నారులకు మాత్రమే ఆధార్ కార్డులు ఇవ్వాల్సి ఉంది.

ఫిర్యాదుల పరిష్కారంలో 12వ ర్యాంకు

ఫిర్యాదుల పరిష్కారంలో జిల్లాకు 12వ ర్యాంకును ప్రకటించింది ప్రభుత్వం. వివిధ అంశాలకు మొత్తం 70.99 పాయింట్లు జిల్లాకు లభించాయి. అందులో ఫిర్యాదులను స్వీకరించే విషయంలో 8.40 పాయింట్లు రాగా, గడువులోగా పరిష్కరించడంలో 19.44, ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం సాధించడంపై 14.87, వీఐపీల ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించడంలో అత్యధికంగా 18.20 పాయింట్లు లభించాయి. వీఐపీల ద్వారా వచ్చిన ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారాలను సాధించిన అంశానికి 10.09 పాయింట్లు వచ్చాయి.

అధికారుల తీరుపై విరుద్ధ ఫలితాలు

ఫిర్యాదుల పరిష్కారంలో అధికారుల తీరుపై నిర్వహించిన సర్వేలో పరస్పర విరుద్ధమైన ఫలితాలు వచ్చాయి. దీని కోసం ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా 902 మందికి ఫోన్‌కాల్స్ చేసి ఫీడ్ బ్యాక్ సేకరించింది. 27 శాతం మంది అధికారుల తీరు బాగా లేదని చెప్పగా 11 శాతం మంది అసలు తమను సంప్రదించనే లేదని చెప్పారు. 57 శాతం మంది తమతో అధికారులు బాగా వ్యవహరించారని చెప్పగా కేవలం 5 శాతం మంది మాత్రమే అధికారులు చాలా బాగా స్పందించారని చెప్పారు. మొత్తమ్మీద 62 శాతం మంది అధికారుల తీరు పట్ల సంతృప్తి చెందినట్టు ఈ సర్వే ద్వారా తేటతెల్లమైంది. కాకపోతే ప్రభుత్వ యంత్రాంగం పనితీరు పట్ల స్టార్ రేటింగ్ సేకరించే క్రమంలో దానికి విరుద్ధమైన ఫలితాలు వచ్చాయి. 63.3 శాతం మంది వన్ స్టార్ రేటింగ్ ఇవ్వడం ద్వారా తమ అసంతృప్తిని వ్యక్తం చేయగా కేవలం 5.7 శాతం మాత్రమే ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీజీఆర్ఎస్ వ్యవస్థను ఇతరులకు సిఫారసు చేస్తారా అన్న ప్రశ్నకు 95.91 శాతం మంది చేస్తామని చెప్పారు. అత్యధికులు అనుకూలంగా స్పందించడం ద్వారా జిల్లా ఆరో స్థానంలో నిలిచింది.

నేడు శాఖల వారీగా సీఎం సమీక్ష

కలెక్టర్ల కాన్ఫరెన్సులో భాగంగా రెండో రోజైన బుధవారం జిల్లాపై సమీక్ష జరగనుంది. వివిధ శాఖల వారీగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లోతుగా సమీక్షించనున్నారు. జిల్లా ప్రగతికి, అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు సంబంధించి కలెక్టర్ వెంకటేశ్వర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.

'ఉపాధి'లో లక్ష్యాలకు మించి పనులు

జిల్లా యంత్రాంగం ఉపాధి హామీ పథకం నిధులతో లక్ష్యాలకు మించి పనులు చేపట్టిందని ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఏడాది ఉపాధి నిధులతో పశువులు నీరు తాగేందుకు 415 తొట్టెలు నిర్మించాలని లక్ష్యం నిర్దేశించగా, జిల్లాలో 1684 నీటి తొట్టెలను నిర్మించారు. ఉపాధి పథకం కింద కూలీలకు 97.01 లక్షల పనిదినాలు సృష్టించిన జిల్లా యంత్రాంగం.. ఆ పనులకు రూ.137.08 కోట్లు మెటీరియల్ వ్యయం కింద ఖర్చు చేసింది. ఈ ఏడాది 229.44 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించగా 203.53 కిలోమీటర్ల నిడివితో 88.70 శాతం పనులు పూర్తి చేసింది. జిల్లాలో 975 గోకులాల నిర్మాణం లక్ష్యం కాగా ఇప్పటికే లక్ష్యానికి మించి 1249 గోకులాలు నిర్మించింది.



బీఆర్ నాయుడికి మహాభారతం గ్రంథాన్ని అందిస్తున్న స్వామీజీలు

పీఠాధిపతులను కలిసిన టీటీడీ చైర్మన్

తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): పాలిమారు మఠాధిపతి విద్యాధీశ తీర్థస్వామిజీ, భీమనకట్టె మఠాధిపతి రఘువరేంద్ర తీర్థస్వామిజీని తిరుమలలోని వ్యాసరాజ మఠంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా హిందూ ధర్మవ్యాప్తికి టీటీడీ చేపడుతున్న కార్యక్రమాలు, సీఎం చంద్రబాబు ఆదేశాలతో దేశవ్యాప్తంగా రాష్ట్ర రాజధానుల్లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి చేస్తున్న కృషిని ఆయన స్వామిజీలకు వివరించారు. భక్తులు సంతృప్తిగా తిరుమల యాత్ర చేసుకునేలా టీటీడీ పనిచేయాలని పీఠాధిపతులు సూచనలు చేశారు. అనంతరం చైర్మన్‌ను స్వామిజీలు శాలువాతో సన్మానించి, మహాభారతం గ్రంథాన్ని బహూకరించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ కూడా పాల్గొన్నారు.

తిరుమలలో నేడు అన్నమయ్య వర్ధంతి

తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి మహోత్సవాన్ని టీటీడీ బుధవారం తిరుమలలో నిర్వహించనుంది. ఈసందర్భంగా శ్రీవారి ఆలయం నుంచి శ్రీమలయప్పస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా ఊరేగింపుగా బయలుదేరి సాయంత్రం 5.30 గంటలకు నారాయణగిరి ఉద్యానవనాలకు చేరుకుంటారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు సప్తగిరి సంకీర్తనా గోష్టిగానం నిర్వహించనున్నారు.

టీటీడీ సర్వశ్రేయస్ ట్రస్టుకు రూ.10.11 లక్షల విరాళం

తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): టీటీడీ సర్వశ్రేయస్ ట్రస్టుకు మంగళవారం రూ.10.11 లక్షలు విరాళంగా అందింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన గౌరవ్ ఐరెన్ అనే భక్తుడు ఈ విరాళాన్ని డీడీ రూపంలో తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి అదజేసి సర్వశ్రేయస్ ట్రస్టుకు వినియోగించాలని కోరారు.

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు భారీగా క్యూలైన్‌లో వేచి ఉన్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ సర్కిల్ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.45 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,358
తలనీలాలు సమర్పించినవారు: 27,024

పురుషోత్తముడికి పుష్పయాగం



స్నపనతిరుమంజనం - స్వామివారికి పుష్పయాగం

చంద్రగిరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పుష్పయాగం వైభవంగా జరిగింది. ఈఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంలో ఏమైనా లోపాలు చోటుచేసుకుని ఉంటే ప్రాయశ్చిత్తంగా ఈవేడుక నిర్వహించారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలనంతరం 7 నుంచి 10 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. 10 నుంచి 11 గంటల వరకు ఉత్సవర్లను ప్రత్యేక వేదికపై కొలువు దీర్చి వివిధ రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించారు. స్నపన తిరుమంజపం నిర్వహించారు. మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పుష్పయాగం కన్నులపండువగా జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, రాష్ట్రాల నుంచి టీటీడీ, దాతలు ద్వారా అందిన మూడున్నర టన్నుల పుష్పాలతో వేద పండితులు స్వామివారికి అర్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్,అర్చకులు శేషాద్రిచార్యులు, బాలాజీ రంగాచార్యులు, పార్థసారథి సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు మునికుమార్‌రెడ్డి, ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా నెల్లూరు జిల్లాలోనే ఉన్నామా..!

కోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం 2022 ఏప్రిల్ 22వ తేదీన జిల్లాల పునర్విభజన చేసింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఉన్న గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలను తిరుపతి జిల్లాలో కలిపింది. ఇది జరిగి మూడేళ్లు పూర్తి కావస్తోంది. అయితే కోట మండలంలోని కొత్తపట్నం సచివాలయ భవనంపై ఇప్పటికీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగానే ఉంది. దీన్ని గమనించిన ప్రజలు కోట మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపడం అధికారులకు ఇష్టం లేనట్టుందంటూ చలోక్తులు విసురుతున్నారు.



కోట మండలం కొత్తపట్నం సచివాలయ భవనంపై నెల్లూరు జిల్లా పేరు

గోడ కూలి ఒడిశా బాలిక మృతి



సునీతానాగ్ (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నీటి తొట్టె గోడ కూలి ఒడిశా రాష్ట్రానికి చెందిన సునీతానాగ్(15) అనే బాలిక మృతి చెందింది. యేటా ఒడిశా నుంచి నీలకంఠం నాగ్ కుటుంబం శ్రీకాళహస్తికి వచ్చి ఆరునెలలు పని చేసుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతుంటుంది. ఈక్రమంలో మూడు నెలల క్రితం నీల కంఠం కుటుంబ సభ్యులతో పట్టణ శివార్లలోని ముచ్చివోలు రోడ్డు పక్కన పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఇటుక బట్టీలో పనిచేస్తున్నారు. నీలకంఠం రెండో కుమార్తె సునీత నాగ్ మంగళవారం బట్టీలో నీటి తొట్టె పక్కన స్నానం చేస్తుండగా గోడకూలి మీద పడింది. బాలికను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మార్చ్యూరీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఐటీ అధికారులకు చెబుతానంటూ వైద్యురాలికి రూ.60 లక్షల టోకరా

నాయుడుపేట టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఐటీ అధికారులకు చెప్పి ఇరికిస్తానంటూ ఓ వైద్యురాలిని బెదిరించి నగదు వసూలు చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... నాయుడుపేటకు చెందిన సత్యనారాయణ నెల్లూరు నగరంలోని వైద్యురాలు బిందుకు ఫోన్ చేసి.. మీ వైద్యశాలకు అధునాతన పరికరాలు అందిస్తానని అతడు చెప్పగా.. ఆమె నిరాకరించారు. దీంతో తనకు ఐటీ అధికారులు తెలుసని, వారికి చెప్పి ఇరికిస్తానంటూ ఆమెను బెదిరించాడు. ఇలా బెదిరించి చివరకు పరికరాలకోసమని ఈనెల 21వ డాక్టర్ బిందు నుంచి రూ.60 లక్షలు తీసుకున్నాడు. అయితే సత్యనారాయణ తనను మోసం చేసినట్లు గ్రహించిన ఆమె నాయుడుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

శ్రీవాణిట్రస్టు మంచి కార్యక్రమం: నటుడు సుమన్



తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): శ్రీవాణిట్రస్టు ద్వారా శ్రీవారిని దర్శించుకునే విధానం ఓ మంచి కార్యక్రమం అని ప్రముఖ సినీనటుడు సుమన్ అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. భక్తుల్లో కొందరు తమ స్థాయికి తగ్గట్టుగా శ్రీవారిని దర్శించుకుంటారని, అందులో శ్రీవాణిట్రస్టు ద్వారా స్వామిని దర్శించుకునే పద్ధతి చాలా బాగుందన్నారు. ఎయిర్‌పోర్టులో కూడా ఈ టికెట్లును కేటాయిస్తుండటంతో చాలా మంది టికెట్లు పొంది తిరుపతిలోని స్థానిక ఆలయాలన్నీ దర్శించుకుని తిరిగి మరుసటి రోజు తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటున్నారన్నారు. ఇక, తన అభిమానులు, నిర్మాతలు, దర్శకులు, టెక్నీషియన్లు అందరు బాగుండాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

పైరసీ క్వాలిటీతో వచ్చేస్తోంది

- సినీ నిర్మాత నాగవంశీ



తిరుమల, మార్చి26(ఆంధ్రజ్యోతి): 'ఈమధ్య పైరసీ ఇబ్బందులు అధికమయ్యాయి. సినిమా విడుదలైన రెండు మూడు రోజులకే చాలా క్వాలిటీతో పైరసీ బయటికి వచ్చేస్తోంది. దాన్ని కంట్రోల్ చేయడానికి ప్రయత్నిస్తాం' అని సినీ నిర్మాత నాగవంశీ అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తన ప్రతి సినిమా విడుదలకు ముందు తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకోవడం సంప్రదాయంగా మారిందన్నారు. ఈవారంలో 'మ్యాడ్ స్క్వేర్' విడుదల సందర్భంగా శ్రీవారి ఆశీస్సుల కోసం వచ్చానన్నారు.

కార్లలో చోరీలకు పాల్పడే వ్యక్తి అరెస్ట్

తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని వివిధ పార్కింగ్ ప్రదేశాల్లో కార్ల అద్దాలను పగలగొట్టి దొంగతనాలకు పాల్పడే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. శ్రీకాళహస్తికి చెందిన హేమచంద్రారెడ్డి అనే వ్యక్తి తన కారును కూడా పక్కనే పార్కింగ్‌లో పెట్టి ఎవ్వరులేని సమయంలో భక్తుల కారు వెనుకభాగంలో ఉండే చిన్నపాటి అద్దాన్ని డ్రిల్లింగ్ యంత్రంతో పగులగొట్టి సెల్ ఫోన్లు, ఇతర విలువైన వస్తువులు దొచుకుపోతున్నాడు. ఈక్రమంలో భక్తుల ఫిర్యాదు మేరకు తిరుమల పోలీసులు మంగళవారం అతన్ని అరెస్ట్ చేశారు. రూ.60 వేల నగదు, రెండు సెల్ ఫోన్లు, చెవికమ్మలు, కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. హేమచంద్రారెడ్డిపై ఇప్పటికే పలు చీటింగ్ కేసులతో పాటు రౌడీషీట్ కూడా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కార్లను పార్కింగ్‌లో ఉంచినప్పుడు విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.

ముత్యాలమ్మ జాతర ప్రారంభం

- పోలేరమ్మ ప్రతిష్ఠ



బంగారుచీరలో ముత్యాలమ్మ

చిల్లకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరులో ముత్యాలమ్మ జాతర కన్నుల పండువగా మంగళవారం ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంగారుచీరలో బంగారుచీరతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. తూర్పు కనుపూరు వీధుల్లో ఉదయం ప్రారంభమైన ఘటం ఊరేగింపు సాయంత్రం వరకు సాగింది. రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి సింహ వాహనంపై అధిష్టింపజేసి విశిష్ఠ పూజలు జరిపారు. అనంతరం అర్ధ రథంపై అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. గంగమిట్ట మీద తాత్కాలికంగా పోలేరమ్మకు వేదిక ఏర్పాటు చేశారు. కోట మండలం సిద్దవకంలో గుడిసెలో కుమ్మరి తయారు చేసిన పోలేరమ్మ విగ్రహాన్ని రజకులు తప్పెట్లు, తాళాల నడుమ మోసుకువచ్చి ప్రతిష్ఠించారు. గాలిగంటల చెట్టు వద్ద కుంభం పోశారు. భక్తులు వేయికండ్ల కుండలలో గండదీపాలు వెలిగించి నెత్తిన పెట్టుకుని, మొలకు వేపాకులు ధరించి ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు.

'నవోదయ'కి 37 మంది విశ్వం విద్యార్థుల ఎంపిక



నవోదయలో సీట్లు సాధించిన విద్యార్థులు

తిరుపతి(విద్య), మార్చి25 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి నిర్వహించిన ప్రవేశపరీక్షల్లో తిరుపతికి చెందిన విశ్వం విద్యాసంస్థల విద్యార్థులు 37మంది ఎంపికైనట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. విక్రమ్, గోపిక, జీవన్, సాయిరెడ్డి, శరత్‌చంద్ర, నవదీప్‌యాదవ్, జాహ్నవి, జశ్వంత్, మిథున్, మిహిల్, నితీష్‌సాయి, సోహిని, అభ్యుదయ, సోహిత్‌తో పాటు మొత్తం 37మంది సీట్లు సాధించారన్నారు. 35 సంవత్సరాలుగా జాతీయస్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలటరీస్కూల్స్ ప్రవేశపరీక్షల్లో తమ విద్యార్థులు విజయపరంపరని కొనసాగిస్తున్నారని చెప్పారు. ఉత్తమ ఫలితాలతోపాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులు సాధిస్తుండడం సంతోషంగా ఉందంటూ విద్యార్థులను అభినందించారు. ఎంపికైన వారికి కరస్పాండెంట్ ఎస్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎస్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందనలు తెలిపారు.

నేడు నల్లగంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో విశ్వబ్రాహ్మణవీధి నల్లగంగమ్మ, తెట్టు ప్రాంతంలో నల్లగంగమ్మ

శ్రీకాళహస్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 26న బుధవారం నల్లగంగమ్మ జాతర జరగనుంది. ఏటా తూర్పుకను పూరు లో కొలువైన ముత్యాలమ్మ జాతర రోజున శ్రీకాళహస్తిలో నల్లగంగమ్మ జాతర జరగడం ఆనవాయితీ. ఈ వేడుకను పురస్క రించుకుని మూడు రోజుల ముందు నుంచే తెట్టు వద్ద నల్లగంగమ్మ ఆలయంలో పాలక మండలి చైర్మన్ కంఠా రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బుధవారం వేకువజామున ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవ మూర్తి ఊరేగింపుతో జాతర ప్రారంభమవుతుంది. తిరిగి రాత్రి నిమజ్జనంతో జా తర ముగుస్తుంది. ఇక ఇక్కడికి సమీపంలోని విశ్వబ్రాహ్మణవీధిలో కొలువై ఉన్న నల్లగంగమ్మ ఆలయంలో మూలమూర్తికి మంగళవారం విశేష అభిషేకాలు, పూజలతో కుంభం సమర్పించారు. బుధవారం భక్తులు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

శివాలయంలో గజ్జ పూజ

పుత్తూరు టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షిదేవి సమతే సదా శి వేశ్వర ఆలయంలో గజ్జ పూజ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని లాస్య తరంగణి నృత్యాలయం మాస్టర్ బాలాజీ ఆధ్వర్యంలో గజ్జ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. శివాలయంలో నృత్యార్చన చేశారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి.



ఆయన చెప్పిన చోట సంతకం పెట్టానంతే!

- నిధుల దుర్వినియోగంతో నాకు సంబంధం లేదు
- డీఎల్‌పీవో విచారణలో డక్కిలి సర్పంచి



డక్కిలి సచివాలయ కార్యదర్శిపై విచారణ నిర్వహిస్తున్న డీఎల్‌పీవో వెంకటరమణ

డక్కిలి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): డక్కిలి గ్రామ పంచాయితీ కార్యదర్శి చైతన్య తన పట్ల వివక్షత చూపుతున్నాడంటూ సర్పంచ్ వేమమ్మ ఇటీవల కలెక్టరుకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం డీఎల్‌పీవో వెంకటరమణ విచారణ చేపట్టారు. పంచాయతీలో నిధుల దుర్వినియోగం, సర్పంచికి, కార్యదర్శికి మధ్య సమన్వయలోపం వంటి అంశాలు విచారణలో చర్చకు వచ్చాయి. పంచాయతీలో రూ.54 లక్షల మేర నిధులు దుర్వినియోగం జరిగాయని వాటిని నిగ్గు తేల్చాలని కొంత మంది టీడీపీ నాయకులు పట్టుబట్టడంతో ఈ అంశంపైనా డీఎల్‌పీవో సర్పంచ్‌ని విచారించారు. 'నేను నిరక్షరాసురాలి. సర్పంచ్‌గా ఎన్నికైన నాటినుంచి మా వైసీపీ నేత మునిరామిరెడ్డి ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెట్టానే తప్ప నిధులు దుర్వినియోగానికి నాకు ఎలాంటి సంబంధం లేదు' అని విచారణ అధికారికి విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై కూడా జిల్లా కలెక్టరుకు నివేదిక అందచేస్తామని ఆయ చెప్పారు. ఇక కార్యదర్శిపై సర్పంచ్ కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుపై విచారించారు. పంచాయతీలో నిధుల దుర్వినియోగం, కార్యదర్శి చైతన్య సర్పంచ్‌పై వివక్ష చూపారా లేదన్న అన్న అంశాలపై సాగిన విచారణపై డిఎల్‌పీవోని వివరణ కోరగా.. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణ అధికారి అల్లాభక్షు, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, సునీల్ రెడ్డి, దందవోలు పెంచలరెడ్డి, సర్వేపల్లి రత్నయ్య, శంకరరెడి, సునీల్ యాదవ్ తదితరులు వున్నారు.

29న శనీశ్వరస్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వరస్వామికి ఈనెల 29వ తేదీ శనివారం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. శని గ్రహం కుంభరాశి నుంచి మీన రాశిలోకి ప్రవేశించడంతోపాటు ఉత్తరాభాద్ర నక్షత్రంతో కూడిన శనివారం, అమావాస్య కావడంతో స్వామివారికి విశేష అభిషేకాలు చేస్తారన్నారు. ఈ అభిషేకాలకు భక్తులు ఒక్కొక్కరు రూ.300చొప్పున టిక్కెట్టు కొను గోలు చేసి పాల్గొనవచ్చన్నారు. ఉదయం 10గంటలకు, సాయంత్రం 5గంటలకు అభిషేకాలు నిర్వహిస్తారన్నారు.

టీటీడీకి విరాళంగా అందిన కెమెరా

తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): నెల్లూరుకు చెందిన వంశీరామ్ బిల్డర్స్ అధినేత వంశీరామ్ సుబ్బారెడ్డి రూ.8.84 లక్షల విలువైన కెనాన్ డిజిటల్ మిర్రర్ లెస్ కెమెరా, లెన్సులను టీటీడీకి విరాళంగా ఇచ్చారు. దాత తరుపున టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి వాటిని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

అభివృద్ధి పనులకు.. పునర్విచారణ నివేదికకు

ముడిపెట్టొద్దు

- పుత్తూరు కౌన్సిల్ తీర్మానంపై ఆర్డీ విశ్వనాథ్



పునర్విచారణపై సమీక్షిస్తున్న ఆర్డీ విశ్వనాథ్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, ఈఈ సుబ్బరాయులు తదితరులు

పుత్తూరు అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో 2019-24 మధ్య జరిగిన అవినీతి ఆరోపణలపై పారదర్శకంగా పునర్విచారణ సాగుతోందని పురపాలక శాఖ రీజనల్ డైరెక్టర్(ఆర్డీ) విశ్వనాథ్ పేర్కొన్నారు. పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, ఈఈ సుబ్బరాయులుతో కలిసి ఆర్డీ మంగళవారం పుత్తూరు మున్సిపాలిటీలో పునర్విచారణపై సమీక్షించారు. ఈ సందర్భంగా పునర్విచారణ పురోగతిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందిస్తున్నామన్నారు. అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రస్తావించిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. ఇటీవల పుత్తూరు మున్సిపల్ కౌన్సిల్‌లో పునర్విచారణ నివేదిక తరువాతే అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడం జరుగుతుందన్న చైర్మన్ నిర్ణయం పట్ల ఆర్డీ విశ్వనాథ్ స్పందించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టే అభివృద్ధి పనులను, అవినీతి ఆరోపణలపై ఇచ్చే నివేదికకు ముడిపెట్టడం సమంజసం కాదన్నారు. పునర్విచారణలో వెలుగు చూస్తున్న అక్రమాల గురించి మీడియా ప్రశ్నించగా ఆర్డీ తోసిపుచ్చారు. ఈ సమీక్షలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఆన్‌లైన్ ద్వారా త్వరలో అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి జ్యోత్స్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెట్ పరీక్షల్లో అర్హత సాధించి న జిల్లాకు చెందిన బీసీ అభ్యర్థులకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 9441456039 ఫోన్ నెంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మేయర్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం

- పావులు కదుపుతున్న కార్పొరేటర్లు
- ఎమ్మెల్యేతో భేటీ

తిరుపతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు మున్సిపల్ పాలకమండళ్లు మేయర్‌పై అవిశ్వాసానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో తిరుపతి కార్పొరేషన్ కూడా ఆ దిశగా అడుగులు వేస్తోంది. మేయర్ పీఠం దక్కించుకోవడానికి కూటమి నేతలు వ్యూహ రచన చేస్తున్నారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశంపెట్టాలంటే ఏపీ మున్సిపల్ చట్టం ప్రకారం నాలుగేళ్ల పదవీకాలం పూర్తి కావాలి. ఈనెల 18వ తేదికి మేయర్‌గా డాక్టర్ శిరీష పదవీకాలం నాలుగేళ్లు పూర్తయింది. వైసీపీకి చెందిన ఆమెను మేయర్ పీఠం నుంచి దించేసి, కూటమి సభ్యురాలు అన్నా అనితను కూర్చోబెట్టాలని భావిస్తున్నారు. ఆమేరకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కూటమి కార్పొరేటర్లు రంగం సిద్ధం చేస్తున్నారు. అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇచ్చేందుకు అధికారులను విధి విధానాలను అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది.

అవిశ్వాసానికి 26 మంది అవసరం

తిరుపతి కార్పొరేషన్లో ప్రస్తుతం 47 మంది కార్పొరేటర్లు ఉండగా, ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్సీ, ఒక ఎమ్మెల్యే కలిపి 50 మందికి ఓటు హక్కు ఉంది. వీరిలో 50 శాతం అంటే 26 మంది నోటీసుపై సంతకాలు చేయాలి. ఇప్పటికే 10మంది వైసీపీ అసమ్మతి కార్పొరేటర్లు ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన విషయం తెలిసిందే. టీడీపీకి చెందిన డిప్యూటీ మేయర్ ఆర్సీ మనికృష్ణతో పాటు అన్నా సిస్టర్స్ కాకుండా మరో 13 మంది వరకు టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. అంటే ఎమ్మెల్యే ఓటుతో పనిలేకుండానే అవిశ్వాసానికి సరిపడా బలం కూటమికి సరిపోతుంది.

ఎమ్మెల్యే ఇంట్లో కార్పొరేటర్ల భేటీ : తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇంట్లో మంగళవారం కూటమి కార్పొరేటర్లు భేటీ అయ్యారు. రాష్ట్రంలో పలుచోట్ల అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెడుతున్నారని, మనం కూడా ముందడుగు వేయాలని చెప్పినట్టు తెలిసింది. కౌన్సిల్లో సరిపడా బలం ఉందని వైసీపీలో ఇమడలేక పలువురు కార్పొరేటర్లు టచ్‌లో ఉన్నారని వివరించినట్టు సమాచారం. ఈనెల 29న జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరుపతికి రానున్నారని, ఆయనతో చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని ఎమ్మెల్యే చెప్పినట్టు తెలిసింది. డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణతో పాటు కార్పొరేటర్లు ఎస్కేబాబు, అన్నా అనిత, నరసింహాచారి, నరేంద్ర నాథ్, పొన్నాల చంద్ర, కుడితి సుబ్రమణ్యం, వట్టికుంట నారాయణ, సీకే రేవతి, కల్పన తదితరులు ఎమ్మెల్యేతో సమావేశమైనవారిలో ఉన్నారు. కాగా మేయర్ వైసీపీనుంచి పోదని, తమ పార్టీకే కార్పొరేషన్ పీఠమని ఆపార్టీ స్థానిక నాయకత్వం ధీమా వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజలు సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అందజేసే అర్జీలను సంబంధితశాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరతగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం సహాయ నిధి ద్వారా వైద్య చికిత్సలకు అవసరమైన చెక్కులను అందజేస్తున్నామన్నారు. అర్హత కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చరణ్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై అవగాహన



సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త విజయశ్రీ

వెంకటగిరి టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రియ ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫర్మెంటెడ్ సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. 20మంది రైతులకు సేంద్రియ ఎరువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే అధిపతి శ్రీనివాసరెడ్డి, శాస్త్రవేత్తలు రాజీవన, తిరుపాల్, నాగార్జున రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్యతో ఎన్నో ప్రయోజనాలు



విశిష్ట సంఖ్య నమోదు చేస్తున్న ఏవో సుజాత

వెంకటగిరి టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రైతులు విశిష్ట సంఖ్యతో ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని ఏవో సుజాత అన్నారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద విశిష్ట సంఖ్య నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 6328 మంది రైతులకు గాను 3138 మంది మాత్రమే ఏపీఎఫ్ఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన వారు కూడా త్వరగా వివరాలు నమోదు చేసుకుని విశిష్ట సంఖ్య పొందాలన్నారు. లేకపోతే ప్రభుత్వ పథకాలు అందవన్నారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, రేఖ, రామచంద్రారెడ్డి, సుబ్రమణ్య, రైతులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాలను నెల్లూరులో కలపాలి



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతాలైన గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలను నెల్లూరు జిల్లాలో కలిపితే రైతులకు న్యాయం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు గిరిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు మండల పరిధిలోని వెంకన్నపాళెంలో గ్రామంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా జిల్లాల పునర్విభజన చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సముద్రతీర ప్రాంతాలైన గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలను రాయలసీమలో భాగం చేశారని తెలిపారు. రాయలసీమ పరిధిలో ఒక ఎకరానికి ధాన్యం 40 బస్తాలుగా నిర్ణయించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. నెల్లూరు జిల్లాలో ఎకరానికి 85 బస్తాల ధాన్యం కొనుగోలు చేసేవారన్నారు. తీర ప్రాంతాలైన గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలను నెల్లూరు జిల్లాలో కలిపి రైతులకు న్యాయం చేయాలని కోటేశ్వరరావు, గిరిధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



కోదండరామాలయాన్ని శుద్ధి చేస్తున్న అర్చకులు, అధికారులు

తిరుపతి(టీటీడీ), మార్చి 23(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కోదండ రామాలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలతో కలగలపిన మిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. హైదరాబాకు చెందిన ప్రసన్నరెడ్డి అనే భక్తురాలు ఆలయానికి మూడు పరదాలు, నాలుగు కురాళాలు విరాళంగా అందించారు. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, ప్రధాన అర్చకులు ఏపీ.ఆనందకుమార్ దీక్షితులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంకురార్పణ

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ బుధవారం రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు అంకురార్పణ చేపట్టనున్నారు. సేనాధిపతి ఉత్సవం, మేదిని పూజ, మృత్సంగ్రహణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రభుత్వాస్పత్రికి రూ.1.50 లక్షల విరాళం



ఎమ్మెల్యే విజయశ్రీకి చెక్కును అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు, పక్కన ఆస్పత్రి అభివృద్ధి కమిటి సభ్యులు, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం పెన్నెపల్లిలో ఉన్న ఎంఆర్ ఆగర్వాల్ కంపెనీ కార్పొరేట్ సమాజిక బాధ్యత కింద సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి రూ.1.50 లక్షలు విరాళంగా అందజేసింది. మంగళవారం కంపెనీ జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం రెడ్డి, డిప్యూటీ మేనేజర్ సంతోష్, అసిస్టెంట్ మేనేజర్ మధుసూదన్ ఎమ్మెల్యే విజయశ్రీ సమక్షంలో చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఏలిమేటి సతీష్, హనుమంతరావు, సరిత, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ కార్యదర్శి ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, గాడి నారాయణరెడ్డి, శ్రీనివాసులు, పార్థసారధి, సుబ్రహ్మణ్యం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి - కోడూరు రోడ్డు కలేనా!

- కాగితాల్లోనే మగ్గుతున్న ప్రతిపాదనలు
- అటవీశాఖ క్లియరెన్స్ ఎప్పుడో ?
- పట్టించుకోని పాలకులు



వెంకటగిరి - పాళెంకోట రోడ్డు

వెంకటగిరి టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి - కోడూరు రోడ్డు నిర్మాణం ఏళ్ల తరబడి కలగా మిగిలిపోతోంది. కడప, నెల్లూరు జిల్లా మధ్య రవాణా సౌకర్యం కల్పించే ఈ రోడ్డు ఏర్పాటు దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైంది. వెంకటగిరి - కోడూరు రోడ్డుకు 1990లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన రెడ్డి శంకుస్థాపన చేశారు. అప్పట్లో ఈ రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్లు నిధులు మంజూరు చేశారు. వెంకటగిరి నుంచి పాళెంకోట వరకు వరకు రోడ్డు నిర్మాణం పూర్తయింది. అక్కడి నుంచి వెలుగొండ అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉండడంతో అటవీశాఖ అధికారులు అభ్యంతరం చెప్పారు. అటవీశాఖ క్లియరెన్స్ ఉంటేనే రోడ్డు నిర్మాణానికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. అటవీశాఖ క్లియర్స్ కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. వెలుగొండ కొండల్లో రోడ్డు నిర్మాణానికి అనుమతిస్తే ఎర్రచందనం అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందని స్థానిక అటవీశాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. దీంతో అటవీ క్లియరెన్స్ మంజూరుకు బ్రేక్ పడింది. ప్రస్తుతం వెంకటగిరి నుంచి రాజంపేట మీదుగా దాదాపు 120 కిలోమీటర్లు ప్రయాణించి కోడూరుకు చేరుకోవాలి. ఇందుకోసం సుమారు మూడు గంటల సమయం పడుతుంది. పాళెంకోట నుంచి వెలుగొండ అటవీ ప్రాంతం మీదుగా రోడ్డు నిర్మిస్తే 90 కిలోమీటర్ల దూరం తగ్గడంతో గంట సమయంలో కోడూరుకు చేరుకోవచ్చు. కడప, కోడూరు, రాజంపేట ప్రాంతాల నుంచి వెంకటగిరితో పాటు చెన్నైకి పెద్దసంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పాళెంకోట నుంచి వెలుగొండల మీదుగా రోడ్డు నిర్మిస్తే ప్రయాణ దూరం తగ్గడంతో పాటు సమయమూ ఆదా అవుతుంది. ప్రజాప్రతినిధులు చొరవ చూపి వెంకటగిరి - కోడూరు రోడ్డు నిర్మాణానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది.





విద్యుత్ దీపాలంకరణలో ముత్యాలమ్మ ఆలయం - దేవతామూర్తుల కటౌట్లు

కాంతులీనుతున్న తూర్పు కనుపూరు



జాతరలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘువేంద్రమీనా, డీఎస్పీ గీతాకుమారి

చిల్లకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరులో ముత్యాలమ్మ మంగళవారం వేడుకగా ప్రారంభమైంది. పెద్దసంఖ్యలో భక్తుల రాక మొదలవడంతో ఆలయం వద్ద సందడి నెలకొంది. బుధ, గురువారాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తుల రద్దీ పెరగనుండడంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. మంగళవారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎస్పీ గీతాకుమారి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముత్యాలమ్మ ఆలయం, పోలేరమ్మ ఆలయం వద్ద క్యూలైన్లను, ఆలయ ఆవరణలోని దుకాణాలను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలను ఏర్పాటు చేయడంతో పాటు ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని సబ్‌కలెక్టర్, డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఈవో నవీన్‌కుమార్, సీఐ కిషోర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం కంచి కామకోటి పీఠం, టీటీడీ ఆస్థాన విద్వాంసుల ఆధ్వర్యంలో నాదస్వర కచ్చేరి నిర్వహించారు.

డాక్టర్ హరిప్రసాద్‌కు ఉత్తమసేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ హరిప్రసాద్

గూడూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నివారణ కోసం కృషి చేస్తున్నందుకు సిద్దు అలర్జీ ఊపిరితిత్తుల ఆస్పత్రి డాక్టర్ హరిప్రసాద్ ఉత్తమసేవా పురస్కారం అందుకున్నారు. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా తిరుపతిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణనాయక్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. తనకు వరుసగా ఆరుసార్లు పురస్కారం రావడం సంతోషంగా ఉందని డాక్టర్ హరిప్రసాద్ అన్నారు.

పోలేరమ్మ ఆలయంలో హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

గూడూరు అర్బన్, మార్చి (ఆంధ్రజ్యోతి): స్థానిక జానకీరామ్ పేటలోని పోలేరమ్మ ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి వినాయకపూజ, నవగ్రహపూజ, లలితసహస్ర పారాయణం, గోపూజ జరిపారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ హోమపూజలను శాస్త్రోపేతంగా నిర్వహించారు. భక్తులు పూజాకార్యక్రమాలలో పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు.

మెగా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఆన్‌లైన్ ద్వారా త్వరలో అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి జ్యోత్స్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెట్ పరీక్షల్లో అర్హత సాధించిన జిల్లాకు చెందిన బీసీ అభ్యర్థులకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9441456039 ఫోన్ నెంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

లా పరీక్షలు నిర్వహించండి: ఎస్‌ఎఫ్ఐ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న లా పరీక్షలన్నీ వెంటనే నిర్వహించాలని ఎస్వీయూ వీసీ అప్పారావును ఎస్ఎఫ్ఐ నాయకులు అక్బర్, అశోక్, నరసన్న, వినోద్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. సెమిస్టర్ ప్రారంభమై ఐదు నెలలైనా పరీక్షలు నిర్వహించలేదని తెలియజేశారు.

పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. మూడురోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ, ప్రొఫెసర్ వేమన, కోర్సు డైరెక్టర్ అరుణశ్రీ, ఈఎల్‌పీ విద్యార్థులు పాల్గొన్నారు.

31లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలి

పెళ్లకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తెల్లరేషన్ కార్డులు ఈనెల 31లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకోకుంటే అన్ని ప్రభుత్వ పథకాలు ఆగిపోతాయన్నారు.

గిరిజనులకు దుస్తులు పంపిణీ

చిల్లకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓడూరు గిరిజన కాలనీలో పేదలకు మంగళవారం పీపుల్ వెల్ఫర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ పొతుగుంట మల్లికార్జున రావు, సీడీపీవో మెహబూబి, సూపర్‌వైజర్ రేణుకమ్మ తదితరులు పాల్గొన్నారు.

యాక్సియాన్ సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏప్రిల్ 12వ తేదీన యాక్సియాన్ -2025 జాతీయ సదస్సు ప్రారంభంకానుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్లను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ హరనాథరెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, మహేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి వర్సిటీలో నైపుణ్య శిక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించే మైక్రోసాఫ్ట్ ఎ-1 వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని వీసీ ప్రొఫెసర్ ఉమ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశాలు దక్కించుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థి దశలో నేర్చుకోవాలన్నారు. ప్రత్యేకించి భాష, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. సంప్రసాఫ్ట్ సీఈవో మల్లిక్ మాట్లాడుతూ మొబైల్, కంప్యూటర్ ఆధారిత టెక్నాలజీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రతినిధి భవానీశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంపిక చేసిన 50 వేల మంది యువతకు మైక్రోసాఫ్ట్ శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. కోయెనిగ్ సొల్యూషన్స్ ట్రైనర్లు అక్విందర్ కౌర్ నేతృత్వంలో బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు అజ్యూర్ పవర్, బీఐ, ఏఐ వంటి అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మనోధైర్యంతో క్యాన్సర్‌ను జయిద్దాం

తిరుపతి(ఆటోనగర్) మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు మనోధైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చని డాక్టర్ సునీత అన్నారు. సింగాలగుంటలో మంగళవారం రాష్ట్రీయ సేవా సమితి(రాస్) మహిళా పొదుపు సంఘాల సమాఖ్య, శ్రీవేంకటేశ్వర మెడికల్ కళాశాల, ప్రసూతి ఆస్పత్రి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు కుటుంబ బాధ్యతల్లో పడి ఆహార అలవాట్లను నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. ప్రతిరోజూ సకాలంలో పరిమిత భోజనం , వ్యాయామం చేయాలని సూచించారు. ఈ శిబిరంలో 49 మంది మహిళలకు బీపీ, షుగర్, నోరు, రొమ్ము, గర్భసంచి సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కవిత, నివేదిత, మౌనిక, శరణ్య, రెడ్డెమ్మ, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

కారు చెట్టును ఢీకొన్న ఘటనలో మరొకరి మృతి

తడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులోని పన్నంగాడు వద్ద ఆదివారం కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న టెంకాయ చెట్టును ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో సంద్రీన్ ఫాతిమా(21), దీనదయాళ్(34) మృతి చెందారు. ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా, చెన్నైలో చికిత్స పొందుతున్న ఎన్.మాదేష్(21) మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే విజయశ్రీ



ప్రార్థనలు చేస్తున్న విజయశ్రీ, టీడీపీ నాయకులు, ముస్లిం పెద్దలు

సూళ్లూరుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని రాఘవయ్యపేటలో ఉన్న జామీయా మసీదులో మంగళవారం ముస్లిం పెద్దలు నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు మసీదు పెద్దలు స్వాగతం పలికి సన్మానించారు. ఎమ్మెల్యే పాటు టీడీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మసీదు పెద్దలు షేక్ అక్బర్, అబ్దుల్ వహాబ్, రహంతుల్లా, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, చిట్టేటి పెరుమాల్, వాకచర్ల రమేష్, కొక్కు శంకరయ్య, పార్థసారధి, మాధవనాయుడు, అలవల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియో థెరపీతో సంపూర్ణ ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఫిజియోథెరపిస్టు రమేష్

కోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు ఫిజియోథెరపీ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్య వంతులవుతారని డాక్టర్ రమేష్, డాక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం హైదరాబాదులోని నిజామ్ ఇనిస్ట్యూట్‌కు చెందిన ఫిజియో థెరపిస్టులు రమేష్, సంతోష్‌కుమార్ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు ఫిజియో థెరపీపై అవగాహన కల్పించారు. ఉద్యోగులు వృత్తిపరంగా, మానసికంగా ఎన్నో ఒత్తిడులకు గురవుతుంటారని, ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొంది సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఫిజియో థెరపీ చేయాలన్నారు.

సిమెంటు రోడ్డు ప్రారంభోత్సవం

దొరవారిసత్రం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళెంలో రూ.7 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ఎమ్మెల్యే విజయశ్రీ మంగళవారం ప్రారంభించారు. అలాగే గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన 4 గోశాలలను ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, శ్రీహరెడ్డి, శ్రీనివాసులు నాయుడు, గోపాల్‌రెడ్డి, ఇట్టగుంట రత్నయ్య, షబ్బీర్, రాజేంద్రప్రసాద్, బాబునాయుడు, కిషోర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

తిరుచానూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు గంగమ్మ జాతర జరిగే సమీప ప్రదేశంలో భూమికి సంబంధించి మంగళవారం ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. కొందరికి గాయాలయ్యాయి. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.